ప్రజాశక్తి

Vol. 1, no. 287

(Sept. 22, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 287

(Sept. 22, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd. No 4486

16 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 22—9—46 ఆదివారం [సంచిక 287

ఈ సంచికలో

మద్రాస్‌రాష్ట్రంలో కమ్యూనిస్టుపార్టీపై నిషేధమా?

పంత్‌ను అనుకరించడానికి ప్రకాశంగారి సంసిద్ధత

(మా విలేఖరి)

మద్రాసు, సెప్టెంబరు 20

కమ్యూనిస్టుపార్టీని నిషేధించాలంటూ పంత్‌జీ (యు. పి. ప్రధాని) నెహ్రూను కోరుతారని ప్రకాశంగారికి ముందేతెలుసు. ఆయన కూడా కమ్యూనిస్టుపార్టీని నిషేధించేటందుకై ప్రయత్నాలు చేస్తున్నట్లు నమ్మదగినవ్యక్తుల ద్వారా తెలుస్తూంది. గోవిందవల్లభపంతు ముందు దారితీస్తే ప్రకాశంగారు అనుకరిస్తారని తెలుస్తూంది.

ఎస్. ఐ. ఆర్. సమ్మెనాయకుల్ని విడుదలచేయ నిరాకరిస్తున్నారు

ఎస్. ఐ. రైల్వే సమ్మెకమిటీ సభ్యుల్ని 94 మందిని విడిచిపెట్టడానికి ప్రకాశంమంత్రివర్గం నిరాకరించింది. నిన్న అఖిలభారత రైల్వేమెన్సు ఫెడరేషన్ కార్యదర్శి, గురుస్వామిగారు, ప్రధానమంత్రిని కలుసుకున్నారు. అసఫాలీ సూచనలను ఆలోచించే అవకాశం యిచ్చేటందుకు అధమం సమ్మె కమిటీ సభ్యుల్ని అయినా విడిచిపెట్టవలసిందని కోరారు. కాని, ప్రధానమంత్రి ఖరాఖండిగా ఆ సూచనను నిరాకరించారు. "అరెస్టయినవారికి జామీను కావాలంటే, వెళ్ళి స్థానిక అధికారులకు చెప్పుకోండి" అని సలహా యిచ్చారు.

సమ్మెను పరిష్కరించేటందుకై జరుగుతూన్న ప్రయత్నాలకు ప్రకాశంగారు ఇచ్చిన సమాధానం వింటే, కమ్యూనిస్టు వ్యతిరేకత ఆయనను ఎవరకు లాక్కుపోయిందో అర్థం అవుతుంది. "కమ్యూనిస్టులు అసఫాలీని బుట్టలో పెట్టగలిగేరేగాని. నేను మాత్రం వారి వలలో చిక్కుకోను" అని ఆయన అసఫాలీ తంతులపై వ్యాఖ్యానం చేశారు.

కళ్యాణసుందరంగారిపై వారంటు

ఎస్. ఐ. రైల్వే లేబరు యూనియను అధ్యక్షులు కామ్రేడ్ కళ్యాణసుందరంగారి మీద వారంటు వున్నట్లే తెలుస్తుంది. కల్యాణసుందరం, నంబియారుగార్లు కూలీలను 'రెచ్చగొట్టడం' చేతనే పోలీసులు మరోదారిలేక 'ఆత్మరక్షణ'కై, తుపాకులు కాల్చారని ప్రకాశంగారు అసెంబ్లీ హాలులో బుకాయించారు. కాని, కళ్యాణసుందరంగారిఉపన్యాసాలలోంచి సి. ఐ. డి. లు కూడా అవిధమైనకేసు బనాయించడానికి సామగ్రిని సేకరించ లేకపోయారు. అప్పుడు కామ్రేడ్ నంబూద్రిపాద్, ఎ. కె. గోపాలన్‌గార్లమీద మోపినట్లే ఆయనమీదగూడా ప్రజలలో మతకలహాలు రేపెట్టారు అనే నేరం మోపబోతూన్నట్లు తెలుస్తూంది,

మన స్వాతంత్ర్యానికే ముప్పు

వజీరుస్తాన్ ఘటనలపై సరిహద్దుగాంధీ ఆతురత

లాహోరు, సెప్టెంబరు 20

నేడు ఢిల్లీవెళుతూన్న సరిహద్దుగాంధీ ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్‌ను లాహోరు స్టేషనులో ఒక పత్రికా ప్రతినిధి కలుసుకొనగా ఆయన ఇల్లా చెప్పారు.

"భారతదేశపు సరిహద్దులోని కొండజాతుల ప్రదేశంలో పరిస్థితులు ప్రమాదకరంగావున్నాయి. మనంఇప్పుడిప్పుడేసంపాదించబోతూన్న స్వాతంత్ర్యానికే అవి ముప్పుతెచ్చిపెట్టేవిలాగ వున్నాయి.

"వజీరిస్థాన్‌లో బాంబులు వెయ్యడం అతిరహస్యంగా జరిగిపోయింది. అది సరిహద్దురాష్ట్రప్రభుత్వానికికూడా తెలియదు.

"ఖుదై ఖిద్మత్‌గార్లను వజీర్‌స్థాన్‌లోని వారివారి ఎన్నేట్లున్న ప్రదేశాలకు వెళ్ళడానికికూడా అధికార్లు అంగీకరించడం లేదు."

"వజీరిస్థాన్‌పై దాడి తాత్కాలిక ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడానికే చేశారు. ఆవిధంగా అప్పుడే ప్రచారం జరిగిపోతోంది కూడా, కాంగ్రెస్ అధికారంలోకి రావడంవల్లనే బాంబులు పడ్డాయని చెబుతున్నారు."

పండిట్ నెహ్రూను కలుసుకున్నప్పుడు సరిహద్దుగాంధీ వజీరిస్థాన్ విషయంలో కేంద్రప్రభుత్వం నూతనపంథా అవలంబించాలని కోరుతారు.

పౌరసత్వ హక్కులకై యాత్రాదళాలు

మలబారు కమ్యూనిస్టుపార్టీ యాజమాన్యాన

కాలికట్, సెప్టెంబరు 20

కాంగ్రెసుమంత్రుల హయాంలో పోలీసులు ఏవిధంగా ప్రజావుద్యమాలను, కమ్యూనిస్టు పార్టీని అణచివేయడానికై నిషేధాజ్ఞలను జారీచేస్తున్నారో, ఇవి ప్రజల హక్కులకే ఎలా ఎసరు పెడతూన్నాయో ప్రజాస్వామ్యానికి ఉద్బోధించడానికై సెప్టెంబరు 10 వ తేదీన మలబారు కమ్యూనిస్టుపార్టీ యాజమాన్యాన రెండుయాత్రాదళాలుబయలుదేరినాయి.

ఈ దళాలు దారిపొడుగునా మీటింగులు జరుపుకుంటూ, సెప్టెంబరు 16 న కాలికట్‌లో కలుసుకున్నాయి. ఈదళాలు మొత్తం 281 మైళ్ళు నడిచాయి. 77 సమావేశాలు జరిపారు 12000 మంది ప్రజలు సభలలో పాల్గొన్నారు

ప్రజలు దళాలకు ఉత్సాహంతో స్వాగతం ఇచ్చారు.

కాలికట్‌లో 144 వున్నా సెక్షను 15, 16 తేదీలలో బ్రహ్మాండమైన సభలు జరిగాయి. ఆ సభలో 7 గురు ప్రతినిధుల్ని ఎన్నుకున్నారు. వారు కలక్టరును కలుసుకుని ఆయన ద్వారా ప్రభుత్వానికి ఒక మెమొరాండము పంపుతారు.

కమ్యూనిస్టులపై పోలీసునిఘా తొలగించాలనీ మీటింగులలో పోలీసులు రిపోర్టులు తీసుకునే పద్ధతిని ఆపాలనీ. కమ్యూనిస్టు నాయకులపై కేసుల నుపసంహరించుకోవాలనీ. "దేశాభిమాని" పత్రికకు ధరావతును తిరిగి యిచ్చివెయ్యాలనీ, పోలీసుల నిర్బంధచర్యలన్నీ నిలుపుచేయాలనీ మెమొరాండములో కోరారు.

గిరిధిగనులలో సమ్మె

శ్రీ మృణాలకాంతిబోస్ ప్రకటన

గిరిధి బొగ్గు గనులలో పనివారు ఈనెల 24 నుంచి సమ్మె ప్రారంభిస్తారని శ్రీ మృణాలకాంతిబోస్ (అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులు) ప్రకటన చేశారు.

కంట్రాక్టు పద్ధతి పోవాలనీ, పనివారికి అధమం నెలకు రు 50 జీతం యివ్వాలనీ, బొగ్గుపనివారి యూనియనును గుర్తించాలనీ. స్టేట్ రైల్వే బొగ్గుగనిలో సాగుతూన్న లంచగొండితనాన్ని రూపుమాపడానికై విచారణ చేయాలని పనివారు కోరుతున్నారు.

అసలీసమ్మె సెప్టెంబరు 6వ తేదీనాదే ప్రారంభం కావలసిందనీ. కొత్తగా ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం పనివారి కోరికలను ఆలోచించే టందుకై వ్యవధిని ఇవ్వడానికి ఆతేదీని మార్చి. 24 కు నిర్ణయించారనీ శ్రీ బోసు ప్రకటిస్తున్నారు.

విశ్వాసరాహిత్య తీర్మానం వీగింది

బెంగాల్ అసెంబ్లీలో చర్చలు

కలకత్తా, సెప్టెంబరు 20

బెంగాల్ అసెంబ్లీలో మంత్రివర్గంమీద ప్రధాన మంత్రిమీద కాంగ్రెసు పక్షంవారు తెచ్చిన రెండువిశ్వాసరాహిత్యతీర్మానాలమీద నిన్నటి తరువాయి నేడు చర్చలు సాగినాయి తీర్మానాలకు అనుకూలంగానూ మొత్తం వ్యతిరేకంగానూ 22 గురు మాట్లాడారు. ఇస్పహానీ తీర్మానానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ శాంతి దళంగా ఏర్పడి నగరంలో తిరగడానికి ప్రధాని ఆహ్వానిస్తే కిరణ్‌శంకర్‌రాయ్, శరచ్చంద్రబోసులు నిరాకరించే రన్నాడు. సంయుక్త ప్రభుత్వం ఏర్పడడం చాలా ముఖ్యమేగాని, మిగిలిన రాష్ట్రాలలోను, కేంద్రంలోనూగూడ సంయుక్త ప్రభుత్వాలు ఏర్పడవలసి వుంటాయి అన్నాడు.

యూరపియన్ గ్రూపునాయకుడు గ్లాడింగ్ మాట్లాడుతూ రాష్ట్రం అంతటా సాయుధ పోలీసుల సంఖ్య చాలాహెచ్చు చేయవలసి వుందనీ, మిలటరీ యొక్కసహాయం ముందుగానే తీసుకొని వుంచుకోవాలనీ చెప్పారు.

చర్చలకు ప్రధాని సుహ్రావర్దీ సమాధానం ఇస్తూ రాజకీయ ప్రదర్శనాలు రాష్ట్రంలోచాలా మట్టుకు అరాజకత్వానికి దారితీశాయనీ వాటినుంచి ప్రభుత్వం ఆత్మరక్షణ చేసుకోజాలకపోవడమే కలకత్తాఅల్లర్లకాలంలో సమయానికి అదుకోలేక పోవడానికి కారణం అనీ చెప్పారు. వేరు వేరు పార్టీ నాయకులు తమ దివాలాకోరు రాజకీయ పంథాలకి ఫలితంగా తెచ్చిపెట్టిన అరాజకత్వాన్ని తమ హక్కుల రక్షణకై సమిష్టి బాధ్యత ప్రదర్శించిన ప్రజలపై రుద్దారు.

ఆఖరున తీర్మానాలపైవోటుతీసుకున్నారు. మంత్రివర్గంపై తెచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానం 131—87 వోట్లతో వీగిపోయింది. ప్రధానమంత్రిపైతెచ్చినతీర్మానం 130.85 తో వీగిపోయింది.

యూరపియన్లు 20 మంది, కమ్యూనిస్టులిద్దరు తటస్థంగావున్నారు. 4 గురు ఆంగ్లో-యిండియన్లు 6 గురు షెడ్యూల్డు తరగతుల సభ్యులు, 1 భారత క్రిస్టియను తీర్మానానికి వ్యతిరేకంగా వోటుచేశారు. రెండో ఇండియన్ క్రిస్టియను అనుకూలంగా చేశాడు.

ఏ. ఐ. సి. సి. తాత్కాలిక అధ్యక్షుని ఎన్నుకుంటుందా?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ రేపుమధ్యాహ్నం వాల్మీకికాలనీలో సమావేశమౌతుంది.

తాత్కాలికప్రభుత్వంలో సభ్యుడయ్యాక పండిట్‌నెహ్రూ అధ్యక్షుడుగా ఉండటమా? లేదా? కొందరేమో పండిట్ నెహ్రూని అధ్యక్షస్థానంలో లాంఛనప్రాయంగావుంచి, ఆక్టింగ్ ప్రెసిడెంటును ఏర్పరిస్తే బాగుంటుందని వెల్లడిస్తున్నారు.

తాత్కాలిక ప్రభుత్వసభ్యులు వర్కింగ్ కమిటీలో ఉండవచ్చునా? లేదా?

ఈవిషయాలపై అభిప్రాయా లుండటం వల్ల ఏసిఫార్సులూ చేయకుండా, అంత్యనిర్ణయానికై అన్ని సూచనలనూ ఎ. ఐ. సి. సి. ముందే వుంచాలెనని వర్కింగు కమిటీ నిర్ణయించింది.

ఎ. ఐ. సి. సి లో చర్చించుటకై 15 అనధికార తీర్మానాలకు నోటీసులువచ్చాయి. క్రిమినల్ ట్రైబ్స్ యాక్టును సంస్కరించాలనీ, బీహార్ యు. పి. రాష్ట్రాల్లో పంచదార చెరుకు ఉత్పత్తిని తగ్గించు కారణాలను గురించి పరిశోధనలు చేయాలనీకూడ ఆ తీర్మానాల్లోవున్నాయి. తాత్కాలిక ప్రభుత్వం నుంచి కాంగ్రెస్‌సభ్యులు బయటికిరావాలన్న పోషరిస్తు సభ్యుని తీర్మానంకూడ ఇందులో వుంది.

ఇంగ్లండులో 'గృహప్రవేశ' ఉద్యమం

12 వేలమంది ప్రదర్శనం

ఈ ఉద్యమం ఇతటితో ఆగదని హారీపొలిట్

(మా విలేఖరి)

లండన్, సెప్టెంబరు 18

ఇంగ్లండులో బయలుదేరిన గృహప్రవేశ ఉద్యమం, లేబరు ప్రభుత్వపు చేతగానితనాన్ని చూపుతుంది. యుద్ధఫలితంగాను, ఇండ్ల దొంగమార్కెటు మూలంగాను, ఒక్క లండన్‌లోనే 6 లక్షలమందికిపైగా తలదాచుకోడానికి నీడలేక అల్లాడుతున్నారు. యీ సమస్య ఈనాడే వచ్చిందికాదు. కాని లేబరు మంత్రులు ఇప్పుడు ఈ ఉద్యమంలో ఇండ్లలో ప్రవేశించినవారిపై కక్షసాధించడంలో చూపుతున్న చురుకుదనం శ్రద్ధా, గత ఒకటిన్నర సంవత్సరాలలోను ఇళ్ళ నిర్మాణానికి చూపివుంటే ఈ సమస్య ఇంత విషమించేదికాదు. ఆరోగ్యశాఖా మంత్రి బెవాన్, ఎప్పుడు చూచినా ప్లానులు తయారైపోయాయనీ, నిర్మాణం చాలా సంతృప్తికరంగా సాగిపోతున్నాయనీ ఉపన్యాసాలు మాత్రం దంచేవాడు. ఇళ్ళ బ్లాక్‌మార్కెట్ విపరీతంగా వుందని వాపోయేవాడేగాని ఒక్క లండన్, జిల్లాలోని 1000 పెద్ద భవనాలు ఖాళీగా పడివున్నాయి. ఇండ్లు లేనివారికి ఇచ్చేటందుకు ఏమీ చేయలేదు. ఇప్పుడు ముఖమంతా ఎర్రజేసుకుని ఇదంతా "అరాజకం" అని గోల చేస్తున్నాడు. టోరీ పత్రిక లన్నీకూడా, ప్రైవేటు ఆస్తికి నష్టం వస్తోందనీ కమ్యూనిస్టులను శిక్షించాలని ప్రచారం సాగించాయి.

12 వేల మంది ప్రదర్శనం

ఈ నెం 15 వ తేదీన జరిగిన "బ్రిటన్‌పై నమావదాడిని ప్రతిఘటించిన యుద్ధవార్షికోత్సవం" అనాడు 12 వేలమంది ఇండ్లు లేనివారు పెద్ద ప్రదర్శనం జరిపారు.

చలికాలం వస్తోంది ఇళ్ళులేని వేలకొలది బీద కార్మికులు, ప్రజలు పడే అవస్థలు వర్ణనాతీతంగా వున్నాయి పసిపిల్లలు చచ్చిపోతున్నారు. సంసారుల జీవితాలు నరకతుల్యమవుతున్నాయి. పెళ్ళిళ్ళుకూడా భగ్నమవుతున్నాయి. ఇకగత్యంతరంలేక వారీగృహప్రవేశ ఉద్యమం సాగించుతున్నారు.

లండన్‌లో ఈఉద్యమం 8 వ తేదీని ఆరంభమైంది కమ్యూనిస్టుల నాయకత్వాన వేలకొలది పూరేగింపులుగా వెళ్ళి ఖాళీగావున్న భవనములు ఇళ్ళల్లో ప్రవేశించడం మొదలుపెట్టారు ఈకార్యక్రమం ఒక వారంరోజులు సాగింది. ఎన్నుకోబడిన కమిటీలు వారికి కావలసిన సౌకర్యాలకోసం పనిచేస్తున్నాయి. వారు ఒక్కొక్క కుటుంబం నెలకు రు. 30 ల చొప్పున అద్దెనివ్వాలని నిర్ణయించారు.

హారీపొలిట్ ఉపన్యాసం

"టోరీపత్రికలు లేబర్‌మంత్రులు చేసేదుష్ప్రచారానికి సమాధానంచెప్పడానికి ఒక పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేయబడింది బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి హారీ పొలిట్ ఇలా ఉపన్యసించారు. ఈ ఉద్యమం ఇంతటితో ఆగదు. తమతోడివారు ఇండ్లులేక వీధులలోపడి చచ్చిపోతూవుంటే కార్మికులు చూస్తూకూర్చోలేరు ఇప్పుడు ఇళ్ళలో ప్రవేశించినవారిని బయటికి నెట్టివేసే ప్రభుత్వ ప్రయత్నాలు ఎవరూ సహించరు లేబరు ప్రభుత్వం ఇళ్ళ సమస్యలను తీర్చి తనకర్తవ్యాన్ని నెరవేర్చేవరకూ యీ పోరాటం సాగుతూనే వుంటుంది" అన్నాడు

ప్రజా సానుభూతి

6 లక్షల సభ్యత్వంగల లండన్ ట్రేడ్ కౌన్సిల్, ఈ గృహప్రవేశ ఉద్యమాన్ని బలపరుస్తూ తీర్మానించింది. భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మిరాజ్‌కర్, (ఇప్పుడు లండన్‌లోఉన్నాడు. వారిని అభినందిస్తూ సందేశం పంపాడు. పారిస్ పెయింటర్సు అసోసియేషన్‌కూడా అభినందన సందేశంపంపింది. పారిస్‌లోకూడా ఇలాంటి ఉద్యమాన్ని ఆరంభించబోతున్నామని తెలిపింది.

తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగు చేరదు

ప్రజల ప్రదర్శనాలు

రంగూన్, సెప్టెంబరు 20

"బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించిన తెల్లకాగితం రద్దుచేసుకొని, జాతీయ ప్రభుత్వం ఏర్పరుస్తేతప్ప గవర్నరు కార్యనిర్వాహక సంఘంలో ఆంటీఫాసిస్టులీగు చేరదు" అని ప్రకటిస్తూ గవర్నరుతో లీగ్ జరిపే సంప్రదింపులకు బలం చేకూర్చడానికై బర్మా ప్రజలు సెప్టెంబరు 29న దేశమంతటా ప్రదర్శనాలు జరపాలని కోరారు. ఆరోజున నిర్బంధ విధానం రద్దుకావాలనీ, జాతీయ ప్రభుత్వం ఏర్పడాలనే నినాదాలు దేశమంతటా మారుమ్రోగాయి.

తెల్లకాగితం రద్దు కావాలంటూ 21 వ తేదీన ప్రదర్శనాలు జరపడానికై సోషలిస్టుపార్టీ నిర్ణయించింది.

ప్రభుత్వోద్యోగులు మొదలగువారు సర్వవ్యాపిత సమ్మె చేయడానికి నిర్ణయించిన 23 వ తేదీన అధికజీతాలు, భత్యాలు యివ్వాలంటూ ప్రదర్శనాలు జరపడానికి కమ్యూనిస్టుపార్టీ నిశ్చయించింది.

బర్మాలో పోస్టాఫీసులలో సమ్మెమూలముగా వార్తాసౌకర్యాలు స్తంభించిపోయినాయి

పోలీసుల సంఘం

రంగూన్‌లోని సమ్మెచేస్తూన్న పోలీసులు ఆంటీ-ఫాసిస్టు నేషనల్ పోలీసు అసోసియేషను పేరుతో ఒకసంఘాన్ని ఏర్పరచుకొన్నారు. వారి ఆశయం బర్మాస్వాతంత్ర్య సాధనకై బ్రిటిష్ సామ్రాజ్య వాదంతో పోరాటం సాగించడం.

భారతీయ పోలీసుల సమ్మె

సమ్మెచేస్తూన్న బర్మా పోలీసులలో భారతీయులు ఇంచుమించు 400 మంది వున్నారు. వీరు 3 రంగుల జెండా తీసుకుని 'ఢిల్లీచలో' నినాదంతో ప్రదర్శనం జరుపుతూ ఢిల్లీకి సెప్టెంబరు 20 న ష్వెడగాన్ పెగోడానుంచి బయలుదేరారు. రంగూన్‌లో పోలీసులను బెదిరిస్తూ పోలీసు కమీషనరు యిచ్చిన ఆజ్ఞలకు అనమ్మతిగా సమ్మెదారులు పెద్ద ప్రదర్శనాలు జరిపారు.

షోన్ మొదటి బ్రిటిష్ రాయబారి

బీరూట్, సెప్టెంబరు 20

బీరూట్‌లో బ్రిటిష్ లెగేషన్‌లోనివుద్యోగి టెరెన్సు షోన్ భారతదేశానికి వెళ్ళడాన్ని గూర్చి లెగేషన్ అధికారులు ఒక ప్రకటన చేశారు. దానిలో షోన్ "కొత్తగా డొమినియన్ అధికారం పొందిన భారతదేశానికి మొట్టమొదటి బ్రిటిష్ రాయబారి పదవిని స్వీకరించబోతున్నాడ"ని ప్రకటించారు.

మీరెప్పుడు పోరాడాలో చెబుతాం

సంస్థాన ప్రజామండలి హితవు

ఢిల్లీ, సెప్టెంబరు 21

సంస్థాన ప్రజామండలి స్థాయిసంఘసమావేశం అబ్దుల్లా శిక్షకు అసమ్మతి తెలుపుతూ తీర్మానం చేసింది. దానిలో ప్రజల అభిప్రాయాలను లెక్కచేయని కాశ్మీర ప్రభుత్వం లాంటి ప్రభుత్వాలను ఎదిరించి ప్రజలు ఆత్మగౌరవం కాపాడుకోవడం ఒక్కటే తగిన మార్గంఅని ప్రకటించింది

అబ్దుల్లా కోర్టులో ఇచ్చిన వాఙ్మూలాన్ని అభినందిస్తూ, కాశ్మీర ప్రజల పోరాటానికి తమ తోడ్పాటును ప్రకటించింది

మరొక తీర్మానంలో సంస్థానాలలోని పరిస్థితులను గురించి చర్చించింది,

"మొత్తంమీద సంస్థానాలలోపరిస్థితులేమీ అనుకూలంగాలేవు" అనితీర్మానించింది.ఆపరిస్థితులనెదుర్కొనడానికై 'ప్రజలను సంఘటితపరచా'లంది. కాని, దాని ప్రక్కనే 'సంస్థాన ప్రభుత్వాలతో స్నేహ సంబంధాలు' కొనసాగిస్తానంటూ స్థాయిసంఘం తీర్మానించి తన సంస్కరణ వాద దృక్పథాన్ని బయటపెట్టింది. ప్రజామండలికి - సంస్థాన ప్రభుత్వాలకీ గల సద్భావాలను చెడగొట్టి పరిస్థితులను విషమం చేయడానికై కొందరు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని తెగనాడుతూ, ప్రజోద్యమాలు తన యాజమాన్యాన గాని జరగరాదంది.

కొచ్చిన్, బస్తర్, ప్రాచ్య సంస్థానాలమీద కూడా తీర్మానాలు చేయబడినాయి. సమావేశానికి ఒరిస్సా ప్రధాని హరికృష్ణ మెహతాబ్, వి. కె. కృష్ణమీనన్‌గార్లు ఆహ్వానించబడ్డారు.

ద్వారకనాథ కచ్రూ విడుదల

శ్రీనగర్, సెప్టెంబరు 20.

అఖిలభారత సంస్థాన ప్రజామండలి సహాయకార్యదర్శి ద్వారకానాథ కచ్రూపై కేసును ఎత్తివేసుకుని కాశ్మీర ప్రభుత్వం ఆయనను వదలివేసింది.

జూన్ 20 వ తేదీన పండిట్ నెహ్రూ నిషేధాన్ని ధిక్కరించి కాశ్మీర్‌లో ప్రవేశించినప్పుడు కచ్రూ అరెస్టుచేయబడ్డారు. అప్పటినుండీ ఆయనపై దేశరక్షణచట్టం క్రింద విచారణ సాగుతూంది ఇప్పుడు ఆయనమీద కేసులు ఎత్తివేసుకోబడినాయి.

నైజాం ఆంధ్రసభ

నూతన కార్యవర్గం

సెప్టెంబరు 10, 11, 12 లలో ఖమ్మంమెట్టులో జరిగిన ఆంధ్ర మహాసభ స్థాయి సంఘసమావేశంలో, శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారికి అధ్యక్షాధికారం, రావి నారాయణరెడ్డిగారిచే అప్పగించబడింది ఆంధ్రమహాసభ నూతన అధికారవర్గంగా క్రిందివారిఎన్నుకబడింది.

అధ్యక్షులు శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారు. ఉపాధ్యక్షులు శ్రీ అరుట్ల లక్ష్మీనరసింహారెడ్డిగారు ప్రధాన కార్యదర్శి శ్రీ రావి నారాయణరెడ్డిగారు సహాయ కార్యదర్శి శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్య గారు.

క్విట్ ఇండియా ప్రధాన నినాదం కావాలి

అరుణా అసఫాలీ అభిప్రాయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20

శ్రీమతి అరుణా అసఫాలీ అ. ప్రె. విలేఖరితో ఇలా అంది.

తాత్కాలిక ప్రభుత్వసభ్యులు వర్కింగ్ కమిటీలో ఉండకూడదు. 'క్విట్‌ఇండియా' నినాదాన్ని వర్కింగ్ కమిటీ ప్రథమంగానూ ప్రధానంగానూ తీసుకోవాలి. దీన్ని అమలుపరచుటకై వెంటనే ప్రభుత్వానికి సూచన లివ్వాలి. అని శ్రీమతి అరుణ తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

సోషలిస్టుపార్టీకి కార్యదర్శి పట్వర్ధన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20

అఖిలభారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీకి కార్యదర్శిగావున్న జయప్రకాశ నారాయణ రాజీనామా ఇచ్చినందువల్ల అచ్యుత పట్వర్ధన్‌ను కొత్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. జయప్రకాశ్ వర్కింగు కమిటీ సభ్యుడుగానే ఉంటాడు.

నిమ్నజాతుల ప్రదర్శనం

పూనా, సెప్టెంబరు 20

ఎ. ఐ. సి. సి. సమావేశమప్పుడు అఖిలభారత నిమ్నజాతుల ఫెడరేషన్ వారు అసమ్మతి ప్రదర్శనమొకటి ఏర్పాటు చేస్తున్నారని ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ రాజభోజ్ ద్వారా తెలుస్తోంది.

తాత్కాలిక ప్రభుత్వం విదేశవ్యాపారంలో భారతీయులకు సమాన హక్కులుండాలి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20

"జాతీయంగాను, అంతర్జాతీయంగాను వ్యాపారాన్ని అభివృద్ధిపరచుటకై ప్లానులు వేసేటప్పుడు, పరిశ్రమల్ని గురించేకాకుండా కార్మికుల, వ్యవసాయదారుల క్షేమాన్ని గురించికూడ భారతప్రభుత్వం ఆలోచిస్తుంది" అని వాణిజ్యశాఖా సభ్యుడు, సి. హెచ్. భాభా న్యూఢిల్లీలో జరుగుతున్న వాణిజ్య విధాన నిర్ణాయకకమిటీ సమావేశాన్ని ఇవ్వాళ ముగింపుచేస్తూ వెల్లడించాడు.

ఈ కమిటీ ఇవ్వాళటి సమావేశంలో యీ క్రింది నిర్ణయాలను చేసింది

1. పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు ముడిపదార్థాల విషయంలో పూర్తి అవకాశాలు కావలెనంటే ఆర్థికంగా వెనకబడ్డ దేశాలకు యంత్రసామగ్రిని దిగుమతి చేసుకొనే అవకాశాలు టెక్నికల్ నైపుణ్యం పొందే అవకాశాలూ ఇచ్చితీరాలి

2. విదేశాల్లో వ్యాపారం చేయడానికిగాను భారతీయులకు సమానమైనహక్కులుండాలి.

3. వెనకబడ్డ దేశాల్లోని ఉత్పత్తినిగురించీ వ్యాపారాన్నిగురించీ పారిశ్రామికంగా అభివృద్ధి పొందిన దేశాలు అవలంబిస్తూన్న తప్పుడు వ్యాపార పద్ధతుల్ని అపివెయ్యాలి.

నాగోడ్ ప్రజావిజయం

జబల్పూరు, సెప్టెంబరు 18

నాగోడ్ సంస్థాన ప్రజామండలి నాయకులకు నల్గురికి నాలుగేసి సంవత్సరాలు కఠిన శిక్షవిధిస్తూ, మొన్న సెప్టెంబరు 6న తీర్పు చెప్పారు. వారి విడుదలకై ప్రజలు తీవ్ర ఆందోళనచేశారు దానిఫలితంగా, మైనరుగు రిపి సంస్థానాధీశుడు విడుదలచేశాడు.

కమ్యూనిస్టుపార్టీని నిషేధించడమంటే

సామ్రాజ్యవాదుల కుట్రలు ఫలించడం, మన స్వాతంత్ర్య పోరాటాన్ని పిచ్చిపచ్చుంచేసుకోడం

దేశభక్తులకు పి. సి. జోషీ విజ్ఞప్తి

కాంగ్రెసులోని మితవాద నాయకులు సంకుచితమైన పాలసీని అనుసరించుతున్నారు. వారు బ్రిటిషు సామ్రాజ్యవాదుల మీద విశ్వాసం చూపుతున్నారు. కమ్యూనిస్టులపైన దండయాత్ర చేస్తున్నారు. దొంగ వ్యాపారస్తులకూ జమీందారులకూ 'దేశభక్తి' ముసుగు వేయ ప్రయత్నించుతున్నారు. కమ్యూనిస్టులను నిందించుతున్నారు. ఇవన్నీ స్వాతంత్ర్యంకొరకు పోరాడే మనప్రజల శిబిరంలో విషమపరిస్థితులను కలిగించుతున్నాయి.

కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడినాయి. కాని దుర్భర అవస్థలు పడుతున్న ప్రజల యిడుమలను తీర్చడానికి కృషిజరగలేదు. పైగా కార్మికోద్యమం నిర్దాక్షిణ్యంగా అణచివేయబడుతోంది. ఈమధ్య జరుగుతున్న పోలీసుల హింసాకాండ మనల 1942 లో జరిగిన నిరంకుశత్వాన్ని జ్ఞాపకం చేస్తోంది. 40 వేల కార్మికులు పాల్గొంటున్న దక్షిణ యిండియారైల్వే సమ్మెను భగ్నంచేయడానికి 1600 మంది అరెస్టు చేయబడ్డారు. అందులో 31మందిస్త్రీలు, 7గురుపిల్లలుకూడ వున్నారు. 60 మందికి తుపాకి దెబ్బలు తగిలాయి. కార్మికుల తల్లులు, భార్యలు అవమానపరచబడ్డారు. అమల్నేరులో 'జలియన్ వాలాబాగ్' లాంటి హత్యాకాండ జరిగింది. నాయకులు చంపబడ్డారు. కాంగ్రెసు ప్రభుత్వాలున్న రాష్ట్రాలలో యు. పి, బొంబాయి మద్రాసులో త్వరత్వరగా కొన్ని శాసనాలు చేస్తున్నారు. ఎందుకు? అధిక లాభాలను అరికట్టడానికికాదు; కనీసజీతాలను గ్యారంటీ చేయడానికికాదు; కార్మిక సంఘాలను గుర్తించడానికికాదు;

తమ హక్కులను రక్షించుకోడానికి, పీనుగులైన యజమానులతో పోరాడటానికి రెక్కలకష్టంపై జీవించే కార్మికులకు ఒకేఒక సాధనంవుంది. అలాంటి సమ్మెహక్కును రద్దుచేయడానికి కాంగ్రెసు ప్రభుత్వాలు శాసనాలు చేస్తున్నాయి. బిర్లా కంపెనీ అధీనంలోవున్న పత్రికలన్నీ కొంతకాలం నుంచి యిలాంటి నిరంకుశ శాసనాలు, చేయాలని ఆందోళన చేస్తున్నాయి.

ఇది సామ్రాజ్యవాదుల కుట్ర

వైస్రాయి, గవర్నర్లు కాంగ్రెసు మితవాద నాయకులకు ఒక విషయం నచ్చచెప్పాలని చూస్తున్నారు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు కాంగ్రెసుకు అధికారం అప్పగించడానికి సిద్ధంగావున్నారని మోసగించ ప్రయత్నించుతున్నారు. ఈలోగా 'శాంతి భద్రతలను' కాపాడటమే కాంగ్రెసు కర్తవ్యమని బోధించుతున్నారు. ఐ. సి. ఎస్. ఉద్యోగులూ, సి ఐ. డీలు 'కమ్యూనిస్టు ప్రమాదాన్ని' గురించిన రిపోర్టులు మంత్రుల చెవిలో నూరిపోస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు కమ్యూనిస్టుపార్టీని నిషేధించడం తప్పదనీ, అవుసరం వచ్చినప్పుడు కఠినం కఠినచర్యలు గైకొనాలనీ వాళ్ళుకోరుతున్నారనే వార్తలు ఇదివరకే ప్రకటించబడ్డాయి. న్యూఢిల్లీలోనూ, రాష్ట్రకేంద్రాలలోని ఉద్యోగులలోనూ, మాపార్టీ నిషేధించబడుతుందనే వార్తలు విరివిగా ప్రచారంలో వున్నాయి. కాంగ్రెసు మితవాద నాయకులతో సన్నిహిత సంబంధమున్న వారిలోకూడ యీ గుసగుసలు వున్నాయి.

సంయుక్త రాష్ట్రాల కాంగ్రెసు మంత్రివర్గం సామ్రాజ్యవాదుల సలహాకు త్వరగా లొంగిపోయిందని రూఢిగా మాకు తెలిసింది. ప్రస్తుతం భారతదేశ మంతటా పార్టీని నిషేధించడమనే సూచనను పండిత నెహ్రూ త్రోసివేశాడని కూడ తెలిసింది. దీనినిబట్టి యింకా ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని తేలుతుంది. ప్రజలు ఐక్యంకలుగచేసుకుంటే ప్రమాదాన్ని తొలగించే అవకాశం మాత్రం వుంది.

ప్రతి దేశభక్తునీ ఎదుర్కొంటున్న ప్రశ్న

పాతపద్ధతులలో బ్రిటిషు సామ్రాజ్యవాదులు మనదేశాన్ని పరిపాలించలేమనే విషయాన్ని నేడు గ్రహించారు. అందుచేతనే బ్రిటిష్ రాయబారులు స్వాతంత్ర్యంకొరకు పోరాడే మన ప్రజలలో చీలికలు పెట్టడానికి కుట్రచేశారు. వాళ్ళనాటిన విషబీజాలఫలించి కాంగ్రెసు - లీగు తగవులుగానూ, మతకలహాలుగానూ తయారు అయ్యాయి. ఈవిధంగా రెండు ప్రధాన రాజకీయపార్టీలమధ్య తగవు పెట్టి సామ్రాజ్యవాదులు వినోదంచూస్తున్నారు. సామ్రాజ్యవాదులు యింతవరకు తాము అణచివేయలేని కమ్యూనిస్టుపార్టీని అణచివేయడానికి కాంగ్రెసు నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు.

ఒక పార్టీపైకి మరొకపార్టీని వుసికొల్పి భారతదేశంలో తమ పాలన కొనసాగించడమే సామ్రాజ్యవాదుల పాలసీ. కాంగ్రెసు ముస్లింలీగు, కమ్యూనిస్టుపార్టీలు కలిసి సమిష్టిగా బ్రిటిషు సామ్రాజ్యవాదులను ఎదిరించి, మాతృదేశాన్నుంచి వాళ్ళను పారదోలడమే కమ్యూనిస్టుల పాలసీ. భారతీయులు తమలో తాము పోరాడుతారా? లేక భారతీయులందరూ కలిసి తమను బానిసత్వంలోఉంచిన బ్రిటిషువాళ్ళతో పోరాడుతారా? ఇదే ప్రశ్న నేడు ప్రతి దేశభక్తునీ, ప్రతి జాతీయసంస్థను ప్రజలందరినీ ఎదుర్కొంటూంది?

కమ్యూనిస్టు వ్యతిరేకత ఎవరికినష్టం?

నిజమైన అధికారం చేతికి రాకపోయినా మితవాద నాయకులు తాము సర్వాధికారులైపోయినట్లు భావిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు తమ లొంగుబాటును కప్పిపుచ్చుకోడానికి వీరు కమ్యూనిస్టు వ్యతిరేకతను రోజురోజుకు ఎక్కువ వెళ్ళగక్కుతూవుంటారు. మన స్వాతంత్ర్యపోరాటం ఇంకా సాగించవలసేవుందని గుర్తించే కాంగ్రెసు సోదరులకందరికీ మేమొక విన్నపం చేస్తున్నాం. మన ఐక్యస్వాతంత్ర్యపోరాటంయొక్క గౌరవాన్ని కాపాడండి.

కాంగ్రెస్‌వాదులకు మాతో భేదాభిప్రాయాలుండవచ్చు. మన భేదాలు ఏవైనా, కమ్యూనిస్టుపార్టీని నిషేధించడంద్వారా సామ్రాజ్యవాదుల కుట్రలు నెరవేరకుండా చేస్తారని ఆశిస్తున్నాం. ప్రస్తుతం కమ్యూనిస్టులు కాంగ్రెసులో లేకపోయినా, మన స్వాతంత్ర్యోద్యమంలో, కమ్యూనిస్టుపార్టీ మొదటినుంచీ అతివాద దృక్పథాన్నే అనుసరించుతోందన్న సత్యాన్నిగుర్తించాలి. నేడు కమ్యూనిస్టుపార్టీ ఎంత బలపడితే, రేపు రాబోయే అంతిమ స్వాతంత్ర్య పోరాటంలో అంత ఎక్కువ సహాయం చేస్తుంది.

కమ్యూనిస్టు వ్యతిరేకతవల్ల జరుగుతున్న దేమిటో చూడండి. కార్మికోద్యమం క్రూరంగా అణచివేయబడుతోంది. కార్మిక సంఘాలు తమ సామాన్యకార్యకలాపాలను కూడా సాగించుకోడం కష్టసాధ్యమైపోతోంది. ఈరోజున కార్మికవర్గం పోరాడుతున్న దెందుకు? దొంగ మార్కెట్‌దార్లనుండి; అధిక లాభాపేక్షగల పెట్టుబడిదార్లనుండి తాము రక్షింపబడి సామాన్య మానవులలాగ బ్రతికే అవకాశం కల్పించమని పోరాడుతోంది. ఈ నాడు కార్మికుల పోరాటాన్ని బలపరచి వారికి ఎక్కువజీతాలు వచ్చేటట్లు సాయపడడమంటే ఒక్క ఫ్యాక్టరీలలోనేకాక ఆఫీసులలోకూడ కష్టపడి పనిచేసేవారందరి జీవిత పరిస్థితిని అభివృద్ధి చేయడానికి కృషిచేయడం అన్నమాట. అందుచేత ప్రజా సామాన్యానికంతకు కమ్యూనిస్టుపార్టీ ఈవిజ్ఞప్తి చేస్తూంది, దొంగ వ్యాపారుల్ని ఉరి తీయాలన్న నెహ్రూ వాగ్దానాన్ని మన కాంగ్రెసు మంత్రులకు జ్ఞాపకం చేసి అమలు జరిపించే ఈ కార్యక్రమంలో మీరంతా చేరాలి.

కనీసం అధికలాభపరులకు వ్యతిరేకంగా కార్మికులు జరిపే ఈ పోరాటంలో విచ్చలవిడిగా పోలీసు దౌర్జన్యాలు జరగకుండా ఆపండి. సమ్మెహక్కునే నిషేధించేచట్టం రాకుండాచేయండి. కమ్యూనిస్టు వ్యతిరేకత పేరుతో కార్మికోద్యమం మరుగుపడిపోకుండా చూడండి.

అభివృద్ధి కాముకుల కర్తవ్య

అభివృద్ధి కాముకులైన విద్యావంతులందరిపై మేంకోరేది ఇది. నేడు కమ్యూనిస్టుపార్టీ మీద దాడిచేయడమంటే సోషలిస్టు భావాల మీదనేదాడి అనిగుర్తించండి అభివృద్ధిని కోరే భావాలమీదనేదాడి అనిగుర్తించండి. అందుచేత కమ్యూనిస్టుపార్టీని నిషేధించకూడదని ఆందోళన చెయ్యండి. సోషలిజాన్ని గురించి ప్రచారం చేయకుండా వాక్స్వాతంత్ర్యాన్ని అరికట్టడం అన్యాయమని చెప్పండి. నవ్య స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో తమ కర్తవ్యాన్ని నెరవేర్చితీర్పడే ఒక అతివాదప్రజాస్వామ్య పక్షాన్ని అణచివేయాలని చూడటం మన స్వాతంత్ర్యోద్యమ ఆశయాలకే విరుద్ధమూ, హానికరమూ అని స్పష్టంచేయండి.

కమ్యూనిస్టు వ్యతిరేకవంథా ఎవరిది?

యూరప్‌ను తన బానిసగా చేయడానికి హిట్లరు ఈ కమ్యూనిస్టు వ్యతిరేకత అనే ఆయుధాన్ని ఉపయోగించాడు. ఈజిప్టుమొదలు ఇరాన్‌వరకువున్న మధ్యప్రాచ్య దేశాలన్నిటిని తమ బానిసత్వంలో వుంచుకోడానికి తమ కుట్రలను కప్పిపుచ్చుకోడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టువ్యతిరేక ప్రచారాన్ని, చేస్తున్నారు. చైనాలో కొమింటాంగు మితవాదులు కమ్యూనిస్టు వ్యతిరేకపంథాను అనుసరించడంవల్లనే మన పొరుగు దేశం అనేక ఏండ్లుగా అంతఃకలహాలతో బాధపడింది. కొన్ని రోజులు జపాను సామ్రాజ్యవాదుల కుట్రలకు బలి అయింది. నేడు అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలకు రంగమయింది. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారమే సామ్రాజ్యవాదుల ఒరలోని

(మిగతా 4 వ పేజీలో)

జమీందార్ల దురాక్రమణలను అరికట్టాలి

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి నండూరి ప్రసాదరావుగారి ప్రకటన

బెజవాడ, సెప్టెంబరు 21

జమీన్ రైతులకు ముందు ఏదో చేయబోతున్నామని ప్రకాశంగారు ఆశపెడుతున్నారు. కాని ఈలోపుగా రైతుల భూములు, అడవులు, సాముదాయక భూములు, బంజర్లు, జమీందార్లచే స్వాహా చేయబడుతూవున్నవి. మంత్రివర్గంచేసేదాగు జమీందార్లకే అనుకూలపడుతూ రైతులకెంతో కీడుకల్గజేస్తూన్నది.

కృష్ణాజిల్లాలో ఉయ్యూరు జమీందారు, హేమలత యను నామెకు, ఆమె బిడ్డలకు మెట్లపల్లి రిజర్వు అడవిలో కొంతభాగాన్ని వ్రాసియిచ్చారు. రైతులు వెళ్ళి ఇదేమి ఘోరమండీ అనిఅడిగితే, మీరు కలెక్టరుకూ మంత్రులకూ చెప్పుకోండి. నేనూ, వారికే చెప్పేదేదిటో చెపుతాను అని పుల్లవిరుపుగా మాట్లాడారు. ఇప్పుడా అడవిని నరికివేస్తున్నారు.

చల్లపల్లి జమీందారు. లంకభూములను, అనాదియబంజర్లను, సాముదాయక భూములను ఆక్రమింపకొని, ఆమ్మటమో, హెచ్చునజరానాలపై పట్టాలీయటమో చేస్తున్నారు. తప్పుఅన్న రైతులపై విపరీతమగు దౌర్జన్యాలు చేయిస్తున్నారు.

పశ్చిమ గోదావరిజిల్లాలో కానూరు. కలవలపల్లి, పోతునూరు మున్నగు గ్రామాలలో ఇట్టివే అనేక అక్రమాలు జరుగుతూవున్నవి.

భూమిపై ప్రొప్రయిటరీహక్కు రైతులదే. అందుచే బంజర్లు, సాముదాయిక భూములు అడవులు. మున్నగువాటిపై జమీందార్లకెట్టి హక్కులూలేవు. కాబట్టి వీటి సందర్భంలో జమీందార్లు గావించే అక్రమణలను. అన్యాక్రాంతములను తమబలం, ఐక్యతద్వారా రైతాంగం నిరోధించాలి. అడవులను నరకడం బంజర్లు, లంకభూములు మున్నగువాటిని అమ్మడం, అన్యాక్రాంతాలు చేయడం, నజరానాలు కోరడం మున్నగు చట్టవిరుద్ధమైన చర్యలను వ్యతిరేకించాలి. రైతాంగం అంతా ఐక్యంగా నిలబడితేనే యిది చేయగల్గుతారు. తమలో తాము పోటీలు, తగవులుమాని జమీందారీ అక్రమాలను నిరోధించవలసినదిగా హెచ్చరించుచున్నాను.

పంత్‌జీ ఢిల్లీ పరుగెత్తిన దెందుకు?

కమ్యూనిస్టుపార్టీని నిషేధించుటకు ప్రయత్నాలు

కార్మిక కర్షక ఉద్యమాలను అణచివేయాలని ప్లాను

లక్నో, సెప్టెంబరు 19

దేశాన్నంతనీ చుట్టబెడుతూన్న సమ్మెల వినురు యు. పి. కి కూడా తగిలింది. ధరల పెరుగుదలతో సమానంగా జీతాలు పెంచడానికి యజమానులు అంగీకరించడంలేదు. ఫలితంగా కార్మికులు దేశంలోని యితర ప్రాంతాలలోని తమ సోదరులు తొక్కిన మార్గాన్నే అనుసరించారు.

యు. పి. లోని జమీందార్లు తమ భూములలోనుంచి రైతుల్ని పెద్దపెట్టున తొలగించివేస్తున్నారు. అలాచేయడంలో వారికి రెండు లాభాలు: ప్రస్తుతంవున్న రైతుల్ని పంపివేస్తే కొత్తరైతుల వద్ద నుంచి దండిగా నజరానాలు గుంజవచ్చు. రెండోది జమీందారీ విధానం రద్దు చేయడం జరిగినప్పుడు కంపెన్సేషన్ పేరుతో కాంగ్రెస్ మంత్రులనుంచి దండిగా సొమ్ము రాబట్టవచ్చు. ఈ విధంగా రెట్టికిరెట్టింపు సొమ్ము జేబులో వేసుకోవచ్చునని వారి ఎత్తు. సహజంగా జమీందార్ల ఈ నీచపుఎత్తులను రైతులు ఆత్మరక్షణకోసం ఎదిరించితీరుతారు.

ప్రజాసంస్థలపై దాడి

సెప్టెంబరు 8 వ తేదీన యు. పి. మంత్రులందరూ సమావేశం అయ్యారు. గవర్నరు తరపున చీఫ్ సెక్రటరీ హాజరయ్యారు. ఆమీటింగులో రాష్ట్రంలోని రైతు-కూలీలలో దినదినమూ పెచ్చు పెరిగిపోతూన్న అశాంతిమీద చర్చలు సాగినాయి. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ప్రవేశపెట్టవలసిందని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసంపుతూ, ఈదిగువ తాత్కాలికచర్యలు తీసుకొనడానికై వారు నిర్ణయించారు.

1. అశాంతి హెచ్చుగావున్న ప్రదేశాలలో ట్రేడుయూనియన్లను, కిసాన్ సభలను నిషేధించటం. మంచి బలం కల కాన్పూరులోని మజ్దూర్ సభ, రాయ్ బరేలీ, బస్తీ (ఆటపూర్‌ది కూడానని తెలుస్తూంది) లలోని కిసాన్‌సభలను నిషేధించే విషయం ఆలోచించబడింది.

2. స్థానికాధికారులు 'ప్రమాద పరిస్థితులు ఏర్పడగలవ'ని రిపోర్టుచేసిన ప్రాంతాలలోనల్లా కమ్యూనిస్టు, కిసాన్ కార్మికనాయకులను అరెస్టుచెయ్యాలి

11 వ తేదీన నెహ్రూపండితుని కలుసుకొనేందుకై గోవిందవల్లభపంత్ ఢిల్లీకి విమానంలో బయలుదేరారు. యు. పి. లో నీయిష్టంవచ్చినది చేసుకోవచ్చునని. కేంద్రప్రభుత్వం దేశం మొత్తంమీద ఏవిధమైన చర్యతీసుకొనే అవసరం అప్పటిమట్టుకు వుండనుకోడం లేదని నెహ్రూసమాధానం చెప్పారట.

కాంగ్రెసువాదుల కవమానం

'కమ్యూనిస్టులు చాలా అల్లరి చేస్తున్నారు'ని. కాంగ్రెసు మంత్రులు 'విధిలేక చర్యతీసుకున్నార'ని పత్రికలలో ఎన్ని వార్తలనునైనా వడవచ్చు. అసలు సంగతి తెలిస్తే ఎవ్వరూ ఆవార్తలను నమ్మరు. మంత్రివర్గం సమావేశానికి— పంత్‌జీ ఢిల్లీ ప్రయాణానికీ నడుమ జరిగిన విషయాన్ని గమనిస్తే ఆయన సరాసరి దొంగవర్తకుల పికిళ్లో చిక్కుకుపోయారని తెలుసుకోగలుగుతాం. స్థానికఅధికార్లకు పోలీసు ఉద్యోగులకు పూర్తి అధికారాలు ఇచ్చివేసినట్లు అర్థం అవుతుంది ఈ దండయాత్ర ఒక్క కమ్యూనిస్టులమీదనేగాక అతివాద భావాలుగల కాంగ్రెసువాదులమీదకూడా జరప బడగలదని తేలిపోతుంది.

(మా విలేఖరి)

ప్రధాని పంత్‌కు దొంగవర్తకుల టీ పార్టీ

సెప్టెంబరు 10 పంత్‌జీ పుట్టినరోజు. కె. యస్. హల్వాసియా, పాల్‌కర్‌మల్ (ఈ ఇద్దరు పక్కా దొంగవర్తకులు, ఇద్దరిమీద ఒకమారు కేసులు నడిచాయి కూడా) రాజారామకుమార భార్గవ (గవర్నరుకు ప్రియభృత్యుడు) గార్ల నాయకత్వాన దొంగవర్తకులంతా పంత్‌జీకి పెద్ద విందుచేశారు.

ఆ రోజున మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఆ సమ్మెదారులు వూరేగింపులూ, ప్రదర్శనలూ జరిపితే ఇంత వుత్సాహమూ ధ్వసంఅయిపోతుందని ఎవరో సూచించారు. వెంటనే అక్కడున్న మంత్రులు ఆలోచించి సమ్మెదారుల ప్రదర్శనాలను నిరోధించడానికై జిల్లామాజిస్ట్రేటు లేన్‌కు, పోలీసు సూపరింటెండెంటు జమునా ప్రసాద్, త్రిపాఠికి పూర్తి అధికారాలిచ్చి పంపించారు. ఇంకప్రారంభమైనాయి అరెస్టులు.

కాంగ్రెసు సేవకుల అరెస్టులు

యు. పి. ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు అధ్యక్షులు శ్రీయుత కన్హయ్‌లాల్‌ను (కమ్యూనిస్టు కాదు) మొదట్లో అరెస్టు చేశారు. దానితో కార్మికులలో అలజడి ప్రారంభం అయింది. మరునాడు శ్రీయుత శివన్‌లాల్ సాగ్జనాను అరెస్టు చేశారు. "నేను నాయకత్వం వహించి నడపకపోతే కార్మికులు కమ్యూనిస్టుల వలకుబడిలోకిపోతారయ్యా"అని ఆయన ఎంత మొత్తుకున్నా ఎవ్వరూ వినిపించుకోలేదు. ఆటుతర్వాత 26 గురు కాంగ్రెస్ సేవకుల్ని అరెస్టుచేశారు.

12 వ తేదిని కమ్యూనిస్టులు సమ్మెయెడ సానుభూతి తెలుపుతూ, అరెస్టు చేయబడిన కాంగ్రెసువాదుల్ని విడుదల చేయాలంటూ పెద్ద బహిరంగసభ జరిపారు. ఆ సభ అధ్యక్షునీ, సభలో మాట్లాడినవారినీ అరెస్టుచేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపీనాథ శ్రీవాస్తవ జైలులోవున్న శివలాల్ సాగ్జనా ఇంటర్యూకి అధికారం తెచ్చుకునేందుకు ప్రధానమంత్రి స్థానే వ్యవహారాలు చూస్తూన్న శ్రీయుత సంపూర్ణానందను కలుసుకున్నాడు జిల్లా మాజిస్ట్రేటును కలుసుకోమని సంపూర్ణానంద సలహా యిచ్చాడు. సంపూర్ణానంద ఛందగా జిల్లా మాజిస్ట్రేట్‌ను కలుసుకోడం కాంగ్రెసువాది ప్రతిష్టకు భంగం అని గోపీనాథ చెప్పారు. కాని, జిల్లా మాజిస్ట్రేటుకు సర్వాధికారాలూ ఇచ్చివేశామని చెప్పి సంపూర్ణానంద గోపీనాథ శ్రీ వాస్తవకు అనుజ్ఞనివ్వ నిరాకరించాడు.

సి. ఐ. డి. లదే రాజ్యం

ఇవిఇల్లా ఉండగా రెండో వైపున పోలీసుల ఇష్టారాజ్యం సాగిస్తున్నారు. సి.ఐ.డి ఆఫీసరు శంభునాథ్ జిల్లాలన్నీ తిరిగి, కమ్యూనిస్టులపై దాడికి సన్నాహాలు చేసుకుంటున్నాడు. శంభునాథ్ పరమకిరాతకుడు. 1930 నాడు భగత్ సింగు అనుచరులను వేటాడిన ప్రబుద్ధుడు. తర్వాత ప్రభుత్వం యు. పి. లో కమ్యూనిస్టులపై దాడి చేయడానికై తగు తరిఫీదులిచ్చింది.

కమ్యూనిస్టులకు సంబంధించిన విషయాలను సేకరించే బాధ్యత ఒక్క సి. ఐ. డి. లకే కాదునప్పజెప్పింది. అధ్వాయిఅర్ల కాలంలోకంటెనూ హెచ్చు స్వాతంత్ర్యం దొరికింది ఉద్యోగులకి. దస్త్రాలు నింపడమేవారిపని.

చీఫ్‌సెక్రటరీ రహస్యసర్క్యులరు

పోలీసుశాఖామంత్రి రఫీఅహమ్మదు కిద్వాయి సమ్మతితో చీఫ్ సెక్రటరీజిల్లా మాజస్ట్రేట్లకు, పోలీసు సూపరింటెండెంట్లకు ఈదిగువ విషయాలు వున్న రహస్యపు సర్క్యులర్లను పంపించాడు:

1. శాంతి - భద్రతలను ఖచ్చితంగా అమలులో వుంచాలి.

2. వారి అధికార ప్రదేశంలో యే మాత్రపు శాంతిభంగం జరిగినా వారు శిక్షించబడతారు.

3. వర్గకలహాలను, మతకలహాలను అణచివెయ్యడంలో వారికున్న అధికారాలను పూర్తిగా అమలులో పెట్టాలి.

1937 లో పంత్‌మంత్రివర్గంరోజుల్లో ఇంతకంటె చాలామెత్తని సర్క్యులరుకే కాంగ్రెసువాదులలో పెద్ద అలజడి కలిగింది చివరకు దానిని మంత్రివర్గం ఉపసంహరించుకోక తప్పిందికాదు.

కథ ఇంకా పూర్తికాలేదు.

ఈ కథ యింతతో ముగియలేదు. మంత్రుల ఒత్తిడివలన యు పి అసెంబ్లీ పోలీసులకు కొత్తఆయుధాలు కొని ఇవ్వడానికై 3 లక్షల 40 వేల రూపాయలను కాంక్షను చేసింది పోలీసుల సంఖ్య హెచ్చు చేయబడుతూంది. మిలిటరీ పోలీసుల సంఖ్య రెట్టింపు చేయబడుతుందట.

మంత్రుల ఈవిధానంయెడ కాంగ్రెసువాదులలో అసంతృప్తి లేకపోలేదు. కాని, దానిని తీసుకుని నడిపించగల నాథుడులేడు. అంతే. శ్రీనామోహర స్వరూప్ సేక్ ఈ విధానానికి అసమ్మతి తెలుపుతూ పంత్‌జీకి లేఖ వ్రాశారు. కాని ఆయన విచారం ప్రజలకోసం కాదు. స్వాతంత్ర్యోద్యమం విచ్ఛిన్నమైపోతుందే యని అంతకన్నాగాదు. మంత్రుల పనివలన కమ్యూనిస్టులు, అతివాదులైన కాంగ్రెసువాదులు ప్రజల దృష్టిలో వీరులయిపోతారేమోనని ఆయన విచారం!

కొద్దిరోజులలోనే యు. పి. కాంగ్రెస్ కమిటీ సమావేశమై ఈ విషయాన్ని చర్చిస్తుంది. జీవితహక్కుల కోసం పోరాతూన్న రైతు - కార్మిక వుద్యమాలని అణిచివేసేందుకు పోలీసులకు పూర్తి అధికారాలిచ్చిన కాంగ్రెస్ మంత్రుల్ని అభినందిస్తారో. లేక దొంగవర్తకుల భూస్వాములతో పోరాడుతూన్న మన ప్రజల పౌరసత్వపు హక్కుల్ని బలపరుస్తారో చూడాలి.

ఎన్నికలనాడు కాంగ్రెసు నాయకులు. పండిట్ నెహ్రూ, పంత్‌జీ మొదలయినవారు ఓటర్లకెన్నో వాగ్దానాలుచేశారు. 1942 కాంగ్రెస్ వాదుల్ని అణిచివేయడానికై హింసాకాండ సాగించిన తెల్లవాళ్ళనీ, నల్లవాళ్ళనీకూడా 'డిస్మిస్' చేస్తామనీ, శిక్షిస్తామనీ చెప్పారు. ఆవాగ్దానాన్ని నిలుపుకొనకపోవడం సరికదా, ఆ హంతకులనే నేడు మనలోనే ఒక భాగం మీదికి ఉసిగొల్పుతున్నారు. 1942 నాటి హంతకులు 1946 లో కాంగ్రెసు మంత్రుల నమ్మిన బంట్లు అయిపోయారా? నేవెలు అధికారంలో వుండగా వారు స్థాపించబోయే 'శాంతి - భద్రత'లు ఎవరికి ఉపయోగిస్తాయి? ఈ పంథా పర్యవసానం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కష్టంకాదు. యు. పి. లోనే గాక, దేశంఅంతటిలోనూ గల దేశభక్తులు, దేశసేవకులు ఒక్కమారు పార్టీ విభేదాలు మరచి ఆలోచించవలసిన సమయం వచ్చింది. వెంటనే ఆలోచించుకోవాలి!

(3 వ పేజీ తరువాయి)

అభరు ఆయుధం. దీనితో వాళ్ళు ప్రజల శిబిరంలో చీలికలు పెట్టచూస్తారు. అధికలాభపరులు, వారి శ్రేయస్సు కోరేవారితో రాజీపడాలని చూస్తారు. మన స్వాతంత్ర్య వుద్యమంలో చీలికలు పెట్టడానికి ప్రజలలో విషప్రచారంచేయడానికి సామ్రాజ్యవాదులకు మనం అవకాశమివ్వకూడదు.

భారత కమ్యూనిస్టుపార్టీ లీగాలిటీ ఒక కమ్యూనిస్టులకు సంబంధించిన విషయం మాత్రమేకాదు. అది బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు భారత స్వాతంత్రోద్యమానికి మధ్య తేలవలసిన సమస్య. ప్రజలకు-అధిక లాభపరులు. సోమరిపోతులకు మధ్య. అభ్యుదయానికి - సంకుచిత తత్వానికి మధ్య తేలవలసిన సమస్య.

మనలో మనకెన్నిభేదాలున్నా దేశభక్తులు, అభ్యుదయం కోరేవారందరూ మా పార్టీని నిషేధించాలనే ప్రయత్నాలనుఎదిరించుతారనే విశ్వాసం మాకుంది. ఏమంటే సామ్రాజ్య వ్యతిరేక అభ్యుదయ భావాలను, స్వాతంత్ర కాంక్షలైన మన ప్రజలను అణచిడానికిజరిగే యీ ప్రయత్నాన్ని వారంతా ఎదిరించుతారని మాకు నమ్మకముంది.

తెలపితేటలకు గీటురాయి

కథ

మహీధర రామమోహన్

బ్రహ్మాండంగావున్నటి పెదవులతో అందుకుని చప్పరిస్తూ 'ఏమనుకున్నారు మనతఢాఖా' అంటున్నట్లు కప్పు అంచుమీదుగా ఒక్క చూపు విసిరాడు సత్యానందం.

అనుకునేందుకేముంది? వచ్చిన రెండో రోజుకల్లా పుట్టపురియల్లా నెలకి రెండు వందలువచ్చే వుద్యోగం కొట్టేశాడు. దాన్ని ఎగరెయ్య, ఒక్కొక్కటి అదృష్టం అది. కాకపోతే ఏమిటి మరి? ఎక్కతరబడి వడిగాపులు పడ్డవాళ్ళకిలేదు. వాడితోపాటే పట్నంలో అడుగెట్టిన మిగిలిన మా ముగ్గురకు రేపటిరోజున ఏ గుమ్మం ఎక్కాలో, ఎన్ని గుమ్మాలు దిగాలో ఇంకా తేలలేదు.

అసలు రహస్యం ఏమిటో కాస్త చెవిని వేస్తే మనకిసాయపడుతుందనుకుంటే — అబ్బే! వాడా, కోస్తేలప్ప గింజుకుచచ్చినా వాడిచేత ఒక్క మాట చెప్పించలేము.

మనవాడి గుణం తెలుసుగా. ఇంక లాభం లేదనుకుని మేమూ టీ కప్పు లందుకున్నాం.

టీ సేవనం ముగిశాక, "సిగరెట్టువెలిగిస్తూ మావాడు గొంతు సవరించుకున్నాడు.

ఇహ చెప్తాడన్నమాట! సిగ్నల్‌వచ్చింది. మేమూ సావధానంగా వున్నాం.

చిటికవేసి సిగరెట్టు దుమ్ము దులుపుతూ అందుకున్నాడు.

"ఒరేయ్! అబ్బీ! మీలో ఎవరేనా 'ఇంటిలిజెన్సుటెస్టు' అనేమాట విని ఏడిశారా?"

వాడే చెప్తాడులెమ్మని అందరం చప్పగా వూరుకున్నాం.

"పూర్వకాలంలో మహారాజుల దగ్గరికి ఎవడేనా కవివెడితే ఏంచేసేవాళ్ళో తెలుసా?"

"చెప్పు"

"'కుంజరయూథంబు దోమకుత్తుక జొచ్చెన్'లాంటిది ఓసమస్య వాడి మొహాన పారవేసేవాళ్ళు. ఆ సమస్యని అతగాడు చక్కగా సమర్థించుకోగలిగితే, ఇంక చూశావూ, శక్తినిపట్టి అక్షర లక్షలు మొదలు ఆణాకానువరకూ అంతో ఇంతో వాడికిచ్చేవాళ్ళు."

"బాగుంది.",

"సరిగ్గా, మనకి అల్లాంటి ఘట్టమే తటస్థపడిందిరా అబ్బాయిలు."

అని అంటూ గర్వం ఉట్టిపడేలాచూశాడు.

"నూలుమిల్లుమీద పద్యాలుగాసి రాశావా యేందా?"

"కవిత్వంకూడ వచ్చునట్రా నీమొహానికి"

"ఒరేయి, ఈ పీనుగ కోస్తున్నాడుగా,"

అంటూ తలోమాట అందుకున్నారు. కాని, సత్యానందం చలించలేదు.

"లోపలికి రమ్మన్నారు. కుర్చీయిచ్చారు. కాఫీతెప్పించారు. స్థిమితపడ్డ తర్వాత యజమాని ఓకథ చెప్పడం మొదలుపెట్టాడు.

"కథలు చెప్పడానికాయేంరా, నీకువుద్యోగం?"

"ఇదేదో 'మినిస్ట్రీస్ అఫ్‌బాగ్దాద్' వ్యవహారంలావుందిగాని —"

ఓసారి దమ్ములాగి సత్యానందం మావేపు హేళనగాచూశాడు.

"ఓ కారునిండా పంచదార ఓ మిల్లువారు బస్తాలు వేసుకుని —"

"నూలు మిల్లులో పంచదార తయారు చేస్తూన్నారట్రా?

"నువ్వునూలు బేళ్లేవేశారనుకో, హాయిగ కధ అని మొదటే చెప్పాడుగా."

సత్యానందం ఎవ్వరిమాటా వినిపించుకోలేదు.

"పంచదారబస్తాలు పర్మిటులేకుండావంపుతున్నారు. ఆసమయంకోసం కాచుక్కూర్చునట్లు ఎవళ్ళోనలుగురొచ్చి చల్లగా లారీతో సహా స్టేషనుకి వప్పజెప్పి, కేసు నమోదుచేయించారు.

"వాళ్ళెవళ్ళో తప్పకుండా కమ్యూనిస్టులయివుంటారు, తప్పకుండా!"

"కాకపోతే మరెవడికి పట్టిందిరే ఈజీతంలేని చాకిరికి — తర్వాత —"

కథోపకథనం సాగుతూనేవుంది."తర్వాత ఏమిటి నీ మొహం. కథ కంచికెళ్ళింది. సాహుకారు జైలుకెళ్ళాడు."

"ఒరేయి, విననీరా, చెప్పనివ్వరేం."

"కానియ్యరా —"

"అంతేరా. కాని, ఇక్కడేవుంది మన వుద్యోగ రహస్యం అంతా. షావుకారు కేసులో చిక్కుకోకుండా తప్పించడం ఎల్లాగ? ఇదీ సమస్య చెప్పండి. మీకో వొక్కడు. చూద్దాం."

"సమస్య మాటకేంగాని, నువ్వేదో పక్కా బ్లాక్‌మార్కెట్టుగాడి ఆఫీసుకి చేరినట్టుతోస్తుంది"

"బిర్లాకంటేనూ పెద్ద బ్లాక్‌మార్కెట్టుగాడు ఏడిశాడుటగాని. దద్దమ్మ కబుర్లు చెప్పడం కాదు. అబ్బాయి! డబ్బు కావాలంటే అంతకంటె వెధవపనులు చెయ్యి చెయ్యాలి."

నిజమే మరి.

"ఈ సమస్యకి సమాధానం చెప్తే వుంది. లేకపోతే నెత్తిన గుడ్డవేసుకు దయచెయ్యాలి అదీ సంగతి."

ముగ్గురం పది నిముషాలసేపు తీవ్రంగా ఆలోచించాం,

సత్యానందం సిగరెట్టు దుమ్ము దులుపుకొని విసుక్కుంటూ, "చప్పచెరిని, ఈమాత్రందానికి ఇంతసేపుఆలోచన తెమిలించేవ్యవహారం" అన్నాడు.

"పట్టుకున్నది కమ్యూనిస్టులే అయివుంటారగనక, ప్రకాశంగారి దగ్గిరికివడుగెత్తమని చెప్తాను."

"ఒకవేళకాకపోతే వాళ్ళందరూ షావుకారుకి పరమశత్రువులనీ, కమ్యూనిస్టులనీ, నేను సాక్ష్యం ఇస్తానని చెప్తాను."

"అసలుకు నాది కానేకాదని, దొంగనేరం మోపారనీ వాదించమంటాను."

"నీపాటి లాయర్ల వాళ్ళకిలేరని, నీచెరవ సలహా" అంటూ సత్యానందం పక్కున నవ్వాడు.

"ఈచచ్చు సలహాకోసం నీమొహానికి నెలకి 2 వందలివ్వక్కర్లేదు., రైలుఖర్చులూ సాక్షులఖర్చులూకూడా పెట్టుకుని కాశేశ్వరరావుగారంతవాడువచ్చి వాదిస్తాడు. దాని కోసం నీదాకా రానక్కర్లేదు"

అంతా నిశ్శబ్దంగా వాదివాదన సంగీకరించాం. లేకచేసేదేముంది?

"అదిగాక, ఓరిచవట నాయనలు! కేసు పోలీసు పైకెళ్ళకెక్కాక ప్రధాని అయితే మాత్రం ప్రకాశం చేసేదేముంది? అంత సాహసం చెయ్యగలడా?

"నిజమే అంసలో కమ్యూనిస్టులతోపని వాళ్ళపేరుచెబితే ఆయన నిద్రల్లోకూడా ఉలికిపడుతున్నాడు,"

మళ్ళీ అంతా ఆలోచించాం,

"అదే ఇంటిలిజెన్స్ అంటే, అమెరికాలో, ఏ కంపెనీలోనైనాసరే ఓ చిన్న వుద్యోగం కావాలంటే ఇల్లాంటిగానే వాడిఇంటిలిజెన్సుని టెస్టు చేస్తారు"

"ఊహూ,"

"ఊహూ యేమిటి నీ బుర్ర"

"కావచ్చు"

"నేనేం చెప్పానో తెలుసా?"

"చెప్పు."

"మీరు పట్టి బరుద్దాయిలు!"

"నీ సమాధానం ఏమిటో మా చెవిని పడేదాకా నీ బత విడువ దలుచుకోలేదు."

సత్యానందం మళ్ళీ ఇంకో సిగరెట్టు ముట్టించాడు.

అందరం వాడేం చెప్పి వుద్యోగం సంపాదించాడో తెలుసుకోవాలని ఆతురతగా వున్నాం.

"చూశారూ! ఒక్క చిన్నచిట్కా."

"దగ్గర్లోవున్న చిన్న పోలీసు స్టేషనుకి వెళ్ళమన్నా. వాళ్ళకో పాతికో- వరకో- అంతకంటె ఎక్కువ అక్కర వుండదులే. మొహాన కొట్టమనూ, కేసు నమోదుచేయించిన వేళకి ఒకటి రెండుగంటలు ముందుగా వేళ వేయించి ఒక బకీరు నమోదు చేయించడం"

"ఏమని?"

"నా సరుకు ఫలానా ఫలానావి- కేసులో ఇరికించిన సామానంతా విలియాగా వ్రాయడమే- ఎవరో ఎత్తుకుపోయారని వ్రాయించమన్నా."

"కాకువాడి మాట."

"వాడి గోల షావుకారుకెందుకు? ఎవడి ఏడుపు వాడేడుస్తాడు. ఆ సరుకు తనకారుకు ఎత్తినవాళ్ళే అన్యాయంగా ఈ కేసు పెట్టారని సాక్ష్యం ఇచ్చి, షావుకారుకి మద్దతు ఇచ్చారా సరేసరి-ఓ ఏభయి వాడికి పడెయ్యవచ్చు ఎదురుతిరిగితే పోతాడు. దొంగతనం కేసులో వాడిని ఇరికించడమే......ఏమంటారు?"

అనేందుకేముంది? 200 రూపాయలు నెలకి మింగేటందుకై తగిన సంహా, సందేహం లేదు. అభినందించకపోవడం ఎల్లాగ?

"హారి! నిన్ను తగలెయ్య!"

లోకం నవ్వింది!

"శ్రీ"

ఎముకల బొమికెలు,
గాలికి దూలే
కంకాళంబులు
చీకటి లోకపు
వాకిటి తలుపులు
వగలదన్నుకొని
పైకి లేచినవి!
కంకాళంబులు
కదలిక కదలిక,
ఆకలి కడుపుల
ఆరుపుల బెదరిన
ప్రజా ప్రధానుల
పలవరింతలకు,
గుండెలు లేపి
తుపాకి గుండ్లే
మందే కడుపుల
తూట్లు బొడిచినవి
మందే సూర్యుని
కుండెలు పీక్కొని
అర్రువానిగాలికి
అంత లోకమూ నవ్వింది

తెలుగురాజ్యము కళ్ల చూడాలోయ్

కొర్లిపర భాస్కరరావు

తెలుగురాజ్యము నేడెక్కవాలోయ్
తెల్లధనికులపీడ వదలాలోయ్
తెలుగుప్రజలకు నేడె కలవాలోయ్
తెలివితెప్పుకు నేడె కదలాలోయ్
తెలుగుపొలములు నేడె తడవాలోయ్
తెలుగురైతులు నేడె తరలాలోయ్
తెలుగునీటిని నేడె దున్నాలోయ్
తెలుగుప్రజలా కరువు తీరాలోయ్
తెల్లనల్ల షావుకార్లూ
మైసూరు నైజాం మహరాజులూ
తెలుగుప్రజలనె వంచుకొన్నారోయ్
తెలుగురక్తము త్రాగుచున్నారోయ్
తెలుగుదేశము చీలిపోయిందోయ్
తెలుగుభాషమె చివికిపోయిందోయ్
తెలుగువారికి నేడు చదువేదోయ్?
తెలుగుప్రజలకు తిండి లేదోయి
తెలుగుప్రజలకు నేడు వోటేదోయ్
తెలుగుప్రజలకు రాజ్యమే లేదోయ్
తెలుగువాళ్లే రాజ్యమేలాలోయ్
తెలుగురాజ్యము నేడె కావాలోయ్
భారతావని నేడు పాకిందోయ్
జాతీయ స్వాతంత్ర్య చైతన్యం
పొగలెగసి పొంగేటి పోరాటం
తెలుగుప్రజలకు నేడు తోడుందోయ్
తెలుగువీరుల స్మరణ చేయాలోయ్
తెలుగుజాతికి స్వేచ్ఛ తేవాలోయ్
తెలుగుప్రజలము నేడె కదలాలోయ్
తెలుగురాజ్యము కళ్ల చూడాలోయ్

పండించేవారికే పొలం

రచయిత:

మోహన్‌కుమారమంగళం

వెల మూడణాలు

తూర్పు యూరపులో ప్రజా ప్రభుత్వాలు వచ్చాయి.

— వచ్చిన కొన్ని నెల్లలోనే ప్రజాజీవిత విధానాన్నే మార్చివేశాయి.

— ఎన్నో అడ్డంకులు వచ్చాయి. కాలచక్రాన్ని వెనక్కు త్రిప్పడానికి కుట్రలు ఎన్నో కుట్రలు,విధ్వంసకకార్యాలు జరిగాయి.

— అన్నీ అద్దుకొని నిల్చారు ప్రజలు. అధికారంలో ఉన్నవారి ప్రతినిధులు?

ఆ మార్పుల్ని చూస్తే మన ప్రజలు విస్తుపోతారు. ఇది నిజమా! అని ముక్కుపై వేలు వేసుకుంటారు.

మన రాష్ట్రంలోనూ ప్రజా ప్రతినిధులు అధికారంలోకి వచ్చారు.

కొందరు కాంగ్రెసు నాయకులు "ఇంకేముంది, వచ్చేసింది రాష్ట్ర స్వాతంత్ర్యం" అన్నారు.

కాని —

పోల్చి చూడండి. తూర్పు యూరపు — మన రాష్ట్రం, అందుకే చదవండి!

ప్రజాశక్తి ప్రచురణాలయం,

— బెజవాడ —

★ విజ్ఞానం-వికాసం ★

ఊరికే సమ్మెలు తేవడం సాధ్యంకాదు

కార్మిక కర్షకులకు కాంగ్రెసు సహాయం చేయకపోవడం అధికారంలేకనా? ఇష్టంలేకనా?

— 'సత్య' —

"కాంగ్రెసుమీద ద్వేషంకొద్దీ కమ్యూనిస్టులు సమ్మెలు తెస్తున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో సమ్మెలు ప్రజల కష్టాల నెక్కువ చేస్తాయి. కాంగ్రెసు కార్మిక, కర్షకుల అభ్యుదయానికి పాటుబడదలచుకొన్నప్పుడు సమ్మెలకు అవకాశంఇవ్వకూడదు, కాంగ్రెసు మంత్రివర్గం రాగానే సమ్మెలు తేవడం దేశానికి ఎంతైనా హానికరమైన పని" అని ఇలాగ అనేకమంది వాదిస్తున్నారు ఈ రోజుల్లో.

ఈ వాదనలో తేలుతున్న విషయాలు మూడు.

1. కమ్యూనిస్టులు కసివల్ల సమ్మెలు తేవాలనుకున్నారు. తేవాలనుకోవడంతోనే తేగలుగుతున్నారు.

2. కాంగ్రెసు కార్మిక, కర్షకుల అభివృద్ధికై పాటుబడడానికి నిశ్చయంతో ఉంది. వారిఅభివృద్ధి తేవడానికి తగిన అవకాశాలు, అధికారం కలిగివుంది. ఓపికతోవుంటే అన్నీ చేస్తుంది.

3. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితు లున్నాయి. అందుచేత వెంటనే ఏమీ చేయలేక పోవచ్చును. కాని కొంతకాలం పోయేక మటుకు అన్నీ చేయగలుగుతుంది.

సంక్షోభకాలంలో కాంగ్రెసు విధానం

కార్మిక, కర్షకులందరిని అభివృద్ధికి తేవాలంటే దేశంలో పెద్ద మార్పు తేవాలి. పెద్ద మార్పులు దేశంలో సంక్షోభం ఉన్న కాలంలోనే సులువుగా రావాలి. క్లిష్ట పరిస్థితుల్లో బాధితులు ఎక్కువగా ఉంటారు. క్రింది తరగతులకు ఉపయోగమైన పనిని దేనిని ప్రభుత్వం చెయ్యాలన్నా, అ కాలంలో పై తరగతులు అంతగా అడ్డలేరు. మధ్యతరగతి కూడా అందుకు అనుకూలంగా ఉంటుంది. దేశంలో కొంత సంక్షోభ ముండబట్టే బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసును త్వరగా మంత్రిత్వంలోకి తీసికొని వచ్చింది. ఈ సంక్షోభ కాలంలోనే కార్మిక, కర్షకుల కనుకూలమైన చట్టాలు చేయవలసి ఉంటుంది. కాని కాంగ్రెసు ప్రభుత్వం వెంటనే అటువంటిదేమీ చేయదలచుకోలేదు. ఈ సంక్షోభకాలం పోయాక ఆ సంగతి ఆలోచిద్దా మనుకుంటూంది. ఈ సమయంలో అవకాశాన్ని జారవిడిచి, అ తరవాతమాత్రం కాంగ్రెసు ఏమి చేయగలుగుతుంది?

కార్మిక, కర్షకుల దుస్థితి కాంగ్రెసు విధానం

లేక కాంగ్రెసుకు ఇప్పుడు వెంటనే కార్మిక, కర్షకుల కనుకూలమైన పెద్ద మార్పులు తీసికొని రావడానికి ఇష్టమున్నా ఇప్పుడు ఆలా చెయ్యడానికి తగిన బలం, అధికారం లేవా? బలం, అధికారం లేకపోతే ఈ సమ్మెలు కాంగ్రెసుమీద విరోధం కొద్ది వచ్చినవని అనడంలో అర్థంలేదు. కాంగ్రెసుకు బలం లేనప్పుడు కార్మిక, కర్షకులు తమ బాగుకై తమ అవస్థలు తాము పడతారు. వారి ప్రయత్నాలను కాంగ్రెసు తనకు వ్యతిరేకమని భావించడం తెలివితక్కువ. లేని అధికారం తనకు ఉన్న దనుకోవడంవల్ల వచ్చిన అనర్థం. కాంగ్రెసుకు వెంటనే కార్మిక, కర్షకుల పరిస్థితిని బాగుచేసే అవకాశం లేకపోయినట్లయితే అలా లేకుండా చేసిన వ్యతిరేక శక్తుల (బ్రిటిష్ ప్రభుత్వం ధనికవర్గం కలయిక)మీద ఉద్దేశింపబడ్డాయి ఈ సమ్మెలు.

కాంగ్రెసుమీద కసికొద్దీ కమ్యూనిస్టులు సమ్మెలు తేవాలనుకున్నారు, తెస్తున్నారు, అనడంలో అసందర్భం చాలా ఉంది. కాంగ్రెసు దేశానికి స్వాతంత్ర్యం తేడానికి ప్రయత్నిస్తూంది. కార్మిక కర్షకుల స్థితిని బాగుచేస్తానంటూంది. కమ్యూనిస్టులకు కావలసినదదే. కాని కాంగ్రెసు నిజంగా చెప్పినట్లు చేస్తూంటే కాంగ్రెసుమీద కమ్యూనిస్టులకు కసి ఎందుకు?

కమ్యూనిస్టులు కాంగ్రెసుమీద కసి కలిగి ఉన్నారనుకోవడం పొరపాటు. కాంగ్రెసు తాను చేస్తానన్న పనులు చెయ్యకపోయినపుడు కమ్యూనిస్టులు ఆ విషయాన్ని గుర్తుకు తెస్తారు. అంతేగాని వారికి కాంగ్రెసుమీద కసలేదు.

ఊరికే సమ్మెలను కల్పించడం సాధ్యమా?

సమ్మె అన్నది సులువుగా వస్తుందా? సమ్మె చేయడానికి కార్మికులు అనేక కష్టాలకు తయారవాలి ఒక ధనవంతుడు సత్యాగ్రహం చెయ్యడంలో పడే బాధకంటె ఒక కార్మికుడు సమ్మె చేస్తున్నప్పుడు ఎక్కువ బాధపడాలి. ఇటువంటి త్యాగానికి, బాధకు కార్మికుడు తయారవాలంటే సులువుకాదు. కమ్యూనిస్టుపార్టీలోని వ్యక్తులు కొంతమంది కాంగ్రెసుపై కసికొద్దీ – ఒకవేళ కసిఉందని ఊహామాత్రంగా ఒప్పుకున్నా – వేలకొలది కార్మికులను సమ్మె చేసి, త్యాగానికి సిద్ధపడమంటే సిద్ధపడరు. సమ్మెలు రావడానికి కొద్దిమంది వ్యక్తుల ఉద్దేశాలు ఎప్పుడూ కారణాలుకావు. ఆర్థికపరిస్థితులవల్ల వస్తాయి సమ్మెలు. ఇప్పుడు దేశంలో ఉన్నాయని కాంగ్రెసు చెపుతున్న సంక్షోభ పరిస్థితులే బ్రతుకును దుర్భరంచేసి. కార్మికులచే సమ్మెలు చేయిస్తున్నాయి. ఈ సమ్మెలను కమ్యూనిస్టులు కసికొద్దీతెస్తున్నారని తప్పుడు అభిప్రాయపడడంకంటె కాంగ్రెసూ, కాంగ్రెసు అభిమానులు సమ్మెలు ఏ పరిస్థితుల్లో వస్తాయో, ఏ కారణాలవల్ల వస్తాయో తెలుసుకోవడం మంచిది.

కాంగ్రెసు మంత్రివర్గాలు రాకముందే సమ్మెలు

సమ్మెలు కాంగ్రెసు మంత్రివర్గ వచ్చేకే బయలుదేరాయనడంలో కూడా అర్థంలేదు. కాంగ్రెసు మంత్రివర్గం రాకముందు పెద్ద సమ్మెలుకొన్ని వచ్చాయి. పోస్టలుసమ్మెకు, రైల్వే సమ్మెకు. మిలిటరీ సమ్మెలకు కాంగ్రెసు ప్రభుత్వంతో సంబంధంలేదు. మద్రాసులో గ్రామోద్యోగస్థుల సమ్మెకు నోటీసు కాంగ్రెసు రాకముందే ఇచ్చేరు. బొంబాయిలో ఉపాధ్యాయులు కాంగ్రెసు రాకముందే సమ్మె చేశారు. ఈ దేశంలోనే కాదు. ఎన్నో దేశాల్లో యుద్ధానంతరం ఏర్పడిన క్లిష్టపరిస్థితులవల్ల సమ్మెలు విపరీతంగా వస్తున్నాయి. అంతేగాని కాంగ్రెసు మంత్రివర్గంవచ్చేక వారిమీద కసికొద్దీ, లేక వారి అలుసుచూసి, కొందరు ప్రోత్సహించడంవల్ల ఈ సమ్మెలు వచ్చాయనుకోడం గ్రుడ్డితనం.

కూలి, రైతులకు మేలు చేయాలంటే కాంగ్రెసుకు యిదే మంచి అవకాశం

కార్మిక, కర్షకులస్థితిని బాగుచెయ్యాలంటే కాంగ్రెసుకు ఇదే మంచి అవకాశం. యీ సమ్మెలు ఎంతో ఉపయోగిస్తాయి. వెంటనే తగిన అధికారం, బలం, కాంగ్రెసుకు లేకపోయినట్లయితే, అలాలేకుండాచేసిన వ్యతిరేక శక్తులమీదనే ఈ సమ్మెలు ఉద్దేశించబడ్డాయి. లేకఅధికారం, బలంఉన్నట్లయితే ఈసమ్మెలు కాంగ్రెసును మరింత బలపరుస్తాయి. కాంగ్రెసు ప్రభుత్వానికి, కార్మిక కర్షకులకు మేలుచేసే ఉద్దేశమే ఉన్నట్లయితే అందుకు తగిన అధికారం ఉన్నట్లయితే, ఈ దేశంలోని సంక్షోభ పరిస్థితులనుచూచి, ఆ అధికారాన్ని ఉపయోగించి, వెంటనే మార్పులు తేవచ్చును.


కాని సమ్మె జరుగుతున్నప్పుడు, సమ్మెవల్ల దేశంలో పరిస్థితులు పాడవుతున్నాయని చెప్పి, సమ్మెకుగల కారణాలను చక్కబరచమంటూ యజమానిని సులువుగా బలవంత పెట్టవచ్చును. యజమాని వినకపోతే, ఆ అన్నిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చును. కనుక కార్మిక కర్షకులకై కాంగ్రెసు పాటుబడదామనుకుంటే ఇదే తగిన అవకాశం. ఈ సమ్మెలు కాంగ్రెసును ఎంతయినా బలపరుస్తాయి.

కూలి రైతు పోరాటాలు కాంగ్రెసు

కాని, కాంగ్రెసు ఈ సమ్మెలను అణగద్రొక్కడానికి పూర్తి సహాయం చేస్తూంది. దీనివల్ల తేలుతున్న దేమిటంటే - కాంగ్రెసుకు కార్మిక కర్షకులకు సహాయంచేస్తే, వారి స్థితిని బాగుచేసే అధికారం బలంలేవు. లేకపోయినా ఉన్నాయని కలలుకంటూ, ఉన్నాయని పైకిచెపుతూ, నిజంగా ఏమీ చెయ్యడానికి వీలులేదుకనుక, ఇది కసివల్ల కమ్యూనిస్టు లేర్పరచిన సమ్మెలని సాకుచెపుతూ, కార్మిక కర్షకులను అణగద్రొక్కుతూంది.

లేక కార్మిక కర్షకులకు సహాయంచేసే అధికారబలం కాంగ్రెసుకు ప్రస్తుతం ఉన్నట్లయితే, నిజంగా వారి స్థితిని బాగుచేయడానికి ఇష్టంలేదని తేలుతూంది. కాంగ్రెసు కార్మిక కర్షకులను వృద్ధిలోనికి తెస్తానని వారిని కబుర్లతో లోబరుచుకొందామని చూస్తూందేగాని, వారు ఏమయినా తమ స్థితిని బాగుచేయమని అడిగితే, చెయ్యాకపోవడమేకాక లాఠీలతో, తుపాకులతో జవాబు చెప్పదలచుకొందని తేలుతుంది. కాంగ్రెసుకు అధికారమైనా లేకపోవాలి. లేక అధికారముంటే ఇష్టమేనా లేకపోవాలి.

కాంగ్రెసుకు అధికారంఉంది. ఇష్టమున్నట్లయితే ఈ సమ్మెలను అప్యాయంగా చేసుకొని, ఆ అధికారం వుపయోగించుకుని దేశంలోని ఆర్థికపరిస్థితులను త్వరత్వరగా చక్కబెట్టాలి. లేక యిష్టముండి అధికారంలేకపోయినట్లయితే యీసమ్మెలనుఆప్యాయంచేసుకొని వాటిని బలపరుస్తూ, కార్మిక కర్షకుల కనుకూలమైన విధానంతో వాటిని పరిష్కరించే అధికారానికి కాంగ్రెసే పోరాటం జరపాలి. అంతేగాని, సమ్మెలను అణచడం, ప్రజాశక్తులను విచ్ఛిన్నం చేయడమేకాక, జాతీయ పోరాటానికే పెద్ద దెబ్బ.



గ్రంథావలోకనం

పండించేవారికే పొలం

(తూర్పు యూరప్‌లో వ్యవసాయక విప్లవం)

రచయిత: మోహన్‌కుమారమంగళం

వెల: మూడణాలు

హంగరీ, బల్గేరియా, యుగోస్లావియా, జెకొస్లొవేకియా మొదలైన తూర్పు యూరప్‌దేశాలప్రజలు, తమజమీందార్లను విదేశీయ పెట్టుబడిదార్లనూ వదిలించుకొని, నిజమైన ప్రజాస్వామిక పరిపాలనను యెలా నిర్మించుకుంటున్నారో, ఈ పుస్తకం చక్కగా నిరూపించింది. ఈ దేశాలను కొల్లగొట్టిన జమీందార్లు, పెట్టుబడిదార్లూ, ఒకప్పుడు హిట్లరు అండజేరి దేశద్రోహంచేసినవారు. యిప్పుడు బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదుల అండజేరి దేశద్రోహానికి తలపెట్టడం. యిందులో యింకొక గమనించవలసిన విషయం. జమీందార్లభూములు పంచుకొని ఇప్పుడు సుఖంగా జీవిస్తున్న రైతులు. ఆ జమీందార్ల పాలనలో యెంతటి దుర్భరజీవితం అనుభవించేవారో. కళ్ళకు కట్టినట్టు చిత్రింపబడింది. అదే పరిస్థితులలో యిప్పుడున్న మన దేశపు రైతులు సుఖపడాలంటే, జమీందారీ విధానాన్ని రద్దు చేయవలసిన ఆవశ్యకతను యీ పుస్తకం తెలియజేసుంది.

మార్షల్ టిటో

రచయిత: వావిరెడ్డి భాస్కరరావుగారు

వెల 0—6—0

నాజీకిరాతకుల పరిపాలనలో నరకబాధ అనుభవిస్తూ యుగోస్లావ్ ప్రజలు సాగించిన స్వాతంత్ర్య పోరాటానికి నాయకుడు మార్షల్ టిటో. రెండవ ప్రపంచ మహాయుద్ధానంతరం స్టాలిన్ తరవాత చెప్పుకోవలసిన ప్రపంచ మహావీరుడు మార్షల్ టిటో. యుగోస్లోవియాలో ప్రజారాజ్యస్థాపనకూ, దారిద్ర్య నిర్మూలనకూ, మార్షల్ టిటో ఎంతటి మహత్తర కార్యాలను నిర్వహించాడో ఈచిన్ని పుస్తకంలో భాస్కరరావుగారు చక్కగా చిత్రించారు.

ఒక్క టిటో జీవితచరిత్ర మాత్రమే కాక, నాజీజర్మనుల రాక్షసపరిపాలన వంతమొందించుటకై పోరాడిన యుగోస్లావ్ యోధుల వీరగాధలుకూడ ఇందులో వున్నాయి. ప్రతివారూ చదివితీరవలసిన పుస్తకం. తేలికభాషలో సరళమైనశైలిలో రచన సాఫీగా చక్కగావుంది. పైరెండు పుస్తకాలు దొరకుచోటు:

ప్రజాశక్తి ప్రచురణాలయం,
మొగల్‌రాజపురం, బెజవాడ.

పెద్ద కాంగ్రెసునాయకుని బాధ్యతారహిత ప్రచారం

గుడివాడలో డాక్టరు పట్టాభిగారి ఉపన్యాస సమీక్ష

టి. కె. విశ్వనాధం
(బి. యె; బి యల్.)

గుడివాడలో 19—9—46 న రాజ్యాంగ నిర్మాణసభను గురించి పట్టాభిగారు పుపన్యసించారు. చాలా చాలా తెలుసుకోదగిన విషయాలు వుంటవి అని అనించి మీటింగుకు వెళ్ళాను.

పట్టాభిగారు అసలు విషయాన్ని గురించి అవగింజంతయినా చెప్పలేదు. రాజ్యాంగ నిర్మాణసభద్వారా ఏ విధంగా స్వరాజ్యం వచ్చేదీ, ఎటువంటి స్వరాజ్యం వచ్చేదీకూడ చెప్పనేలేదు. కాని వారు చెప్పిందేమిటంటే:

"మనం ఒక వూరినుండి ఇంకో వూరికి ప్రయాణం చేస్తూన్నాం, పొలిమేర దాటాం, తప్పక వూరుచేరుకుంటాం." పూర్ణస్వరాజ్యం వచ్చేస్తోందిఅని సెలవిచ్చారు.

ఇక స్వరాజ్యంలో మనం పొందేలాభాలను గురించి చెప్పుతూ యిలా వివరించారు:

"విద్యను మాతృభాషలో నేర్పుతాము, కోర్టులు వూళ్ళల్లో పంచాయతీలుగా మార్చుతాము; తెల్లదొరలతో మనం నౌకరీచేయించుకొంటాం; డాక్టర్లను ఎక్కువచేయించుతాము. ఇవీ స్వరాజ్యంవల్ల మనం పొందే లాభాలు అని పట్టాభిగారు సెలవిచ్చారు.

అసలురంగు బయటపెట్టారు

అక్కడనుండి బయటపడింది పట్టాభిగారి అసలురంగు.

ఇంకా యిలా అన్నారు:

"ఇటువంటి స్వరాజ్యం తెస్తున్నాం. దీన్ని కాపాడుకోవడం కోసం మనమంతా జాగ్రతపడాలి; కమ్యూనిస్టులున్నారు. పాముంలో పుడకల్లాగ!

"కమ్యూనిస్టులకు పితృదేశం, రష్యా; మాతృదేశం భారతదేశం. ఈరెంటికి వీళ్ళు ఎప్పుడో పెళ్ళిచేశారు.

"రష్యా రైతుకూలీ రాజ్యమంటూ తన చుట్టుప్రక్కదేశాలన్నీ దిగమింగికూర్చుంది. డార్డెనెల్స్ జలసంధి కావాలంటోంది. ఇండియాను మ్రింగాలని కాచుకు కూచుంది. మన దేశానికి రష్యాకు 40 మైళ్ళు అడ్డం. మరిఎప్పుడు వచ్చిపడుతుందో! మనం జాగ్రత వహించాలి. రష్యాకుమనకు యుద్ధం వస్తే కమ్యూనిస్టులు ఎవరి ప్రక్కవుంటారో; కాబట్టి మనమంతా వీళ్ళను ఒకకంటితో చూడాలి."

వహ్వా! పట్టాభి!! సామ్రాజ్యవాదులకు కావలసింది యింతకంటే యింకేముంది? వారెంతయినా సంతోషించుతారు. మాకొక ముద్దు తమ్ముడు దొరికాడుగదా అని.

తమలాంటి జ్ఞాతులకోసం బ్రిటిషువారు తమ వలసరాజ్యాలన్నిటిలోను గాలించుతున్నారు. రాయబారాలమీద రాయబారాలు పంపుతున్నారు. ఎందుకుగాను? తమలాంటి వంతపాటగాళ్ళ కోసమే!

పట్టాభిగారూ: మీరు దొరికారు వారికి. బహుశః ప్రథమ బహుమానం మీదే.

ప్రపంచ శ్రమజీవుల ఆశాజ్యోతియైన సోవియటు రష్యాను నాశనం చెయ్యాలని బ్రిటిషు అమెరికా సామ్రాజ్యవాదులుకుట్రలు పన్నుతున్నారన్న సంగతి లోకానికంతా తెలుసు. తమరు కూడా అందులో పాత్ర ధరించేలాగే వున్నారు.

జమీందార్లకు రైతులసొమ్ము దానం

పట్టాభిగారు జమీందారీవిధానం రద్దు విషయమైవచ్చిన ప్రశ్నకు సమాధానంయిస్తూ యిలా సెలవిచ్చారు:

"జమీందార్లు వెళ్ళిపోవటానికి సిద్ధంగానే వున్నారు. తమకు వచ్చే కంపెన్‌సేషను, 50, 60 లక్షలు ఏ పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టమంటారండీ! అని వస్తున్నారు,

ఔను! రాయమా! తమరు వారి మిత్రులనీ, వారిని రక్షించేవారని వారికి తెలుసు. తమకు పబ్లిక్‌వ్యాపారంవుందనీ, తమరు పక్కా పెట్టుబడిదారనీ లోక ప్రఖ్యాతియేగా! జమీందార్ల పెట్టుబడి ఇప్పటికే తమ బ్యాంకులో మూల్గుతుండాలి.

పట్టాభిగారు జమీందార్లకు కంపెన్‌సేషను యిప్పించుతారా? తరతరాలనుండి రైతుల రక్తం త్రాగిన జమీందార్ల దాహం తీరలేదు కాబోలు! పాపం! ఎవడి అబ్బగాడి సొమ్ము అని పట్టాభిగారు దానంచేయదలచుకున్నారు, ఔను! నోరులేని రైతులేగా బలియివ్వటానికి

పట్టాభిగారుయింకా యీలాగు సెలవిచ్చారు. "కమ్యూనిస్టులసిద్ధాంతము హింస. నేనుజైలునుండి వచ్చేసరికి 71 క్రిమినల్ కేసులు జరుగుతున్నాయి. నేను ఒక్కసూత్రం చెప్పాను. కర్ర వుచ్చుకోండి! అన్నాను. ఆ ధర్మిలా 3 కేసులు మాత్రం వచ్చాయి. చూచారా! ఫలితం!

"మీ రంతా కర్రలు కత్తులు పుచ్చుకోండి తాలింఖానాలోకి వెళ్ళండి. సాము, గరడీలు నేర్వండి, ఈ మాటలు మీరు పాటించకపోతే తర్వాత విచారపడతారు. ప్రమాదం ఏ వైపునుండి వస్తుందో: అహింస బ్రిటిషు వారి మీదకే." అని అక్కడచేరిన పట్టణవాసులను హెచ్చరించారు.

ఇంతటి పెద్ద కాంగ్రెసు నాయకుడు ఎంత బాధ్యతారహితంగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టుతున్నాడో ప్రజలు విచారించవలసిన విషయం.

ప్రతిదేశంలోను కమ్యూనిస్టు వ్యతిరేకత యింతకంటే కట్టుదిట్టంగానే, ఇంతకంటే అతిరథుల యాజమాన్యానే జరిగింది. వారంతా గత యుద్ధంలో తుడుచుకుపోయారని పట్టాభిగారు చరిత్ర చదువుకోవాలి.

కమ్యూనిజంపెనుభూతంగాచిత్రించి పెట్టుబడిదార్లు తమ స్వార్థాలను కాపాడుకొనే రోజులు పోయినవి. ప్రజానీకంలో అధిక సంఖ్యాకులయిన రైతు కూలీలు యింత తేలికగా మోసపోరని పట్టాభిగారు ఎంత త్వరగా తెల్సుకొంటే అంతమంచిది.

ఇంకో మనవి

పట్టాభిగారు కమ్యూనిస్టులు దేశద్రోహులన్నారు. కమ్యూనిస్టులు దేశభక్తులేనని ఎంత కండ్లులేనివారికైనా కనపడుతుంది. కమ్యూనిస్టులు దేశభక్తులేకాదు పరిపూర్ణ ప్రజాస్వామికవాదులుకూడాను. దేశభక్తులు ఒకొక్కప్పుడు ప్రజాస్వామికవాదులు కాకపోవచ్చు. ప్రజాస్వామికవాదులు మాత్రం తప్పక దేశభక్తులు అయితీరాలి.

పట్టాభిగారు రాజ్యాంగసభ ద్వారా తెచ్చే స్వాతంత్ర్యం ఎటువంటిదో అప్పుడే అరుణకిరణాలు కనపడుతూనే వున్నాయి. మన కాంగ్రెసు మంత్రిపుంగవుల పాలన ధర్మం నాల్గు పాదాల నడుస్తూవుంది.

మ్యునిసిపల్ కార్మికుల నోళ్ళల్లో దుమ్ము కొట్టారు. రైల్వే కార్మికుల ఆకలి కడుపుల్లో తుపాకిగుండ్లు ప్రేల్చుతున్నారు. రైతులకు వ్యతిరేకంగా జమీందార్లతోను, కూలీలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులతోను చెలిమి చేస్తున్నారు.

ప్రజా అవసరాలను మంట గలుపుతున్నారు. పోలీసు మూకలను ఎక్కువ చేశారు.

ప్రజలడబ్బుతో ప్రజలను హతమార్చటానికి మారణయంత్రాలు కొంటున్నారు. పోలీసులకు, జమీందార్లకు, పెట్టుబడిదార్లకు, హామీలు, రక్షణలు వచ్చాయి. ఇక సుఖపడేదెవరో మరి! వహ్వా! పట్టాభీ!! వచ్చే స్వరాజ్యం యిలాగే వుంటుందా?

చిటగాంగ్‌లో లీగ్ ప్రత్యక్ష పోరాటదినం

ప్రజాఐక్యత మంటగలిసింది—కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంపైదాడి—3 వేల రూపాయల ఆస్తినష్టం—నాయకులకు కత్తిపోట్లు

> కాంగ్రెసుకు వ్యతిరేకంగా అగస్టు 16 వ కమ్యూనిస్టులు, లీగు కలిసిపోయారని అభూతకల్పనలతో ప్రకటనలు చేస్తున్న కాంగ్రెసు పెద్ద డాక్టరు పట్టాభిగారికి ఈ వార్తను అంకితం చేస్తున్నాం—సం.

గత జనవరినెలలో కాశీపురం(ముస్లిం గ్రామం) లో మిలిటరీవాళ్ళు చేసిన దురంతాలను చిట్టగాంగ్‌అంతా ఒక్క గొంతుతో ఖండించింది. హిందువులు ముసల్మానులు ఒక్కమాటమీద నిలబడ్డారు,

ఈ ఐకమత్యాన్ని చెడగొట్టడానికై ప్రభుత్వం ఎఫ్. కరీమ్ ఐ. సి. యస్‌ను జిల్లా కలెక్టరుగా నియమించింది. అయన అడుగుపెట్టింది మొదలు ఈ ఐక్యతను విచ్ఛిన్నంచేసి, ఆ ఐక్యతను నిర్మించిన కమ్యూనిస్టులమీదికే ప్రజల క్రోధాన్ని తిప్పదలిచి ప్రయత్నాలు సాగించాడు.

ఆదశలోవచ్చిన చిట్టగాంగ్ వరదలలో కమ్యూనిస్టుపార్టీ ప్రజాసేవచేస్తూ, ప్రభుత్వోద్యోగుల అసమర్థతనూ, వారు పంపుతున్నామన్న సహాయాలలోగల నిజరూపాన్ని బయటపెట్టి ప్రజలకు తెలియబరిచారు. దానితో జిల్లా మాజిస్ట్రేటు కమ్యూనిస్టులమీద కసితీర్చుకొనేటందుకు అదును చూస్తున్నాడు.

ముస్లింనాయకుల 'పోరాట దినం' అతనికి ఆ అవకాశాన్ని ఇచ్చింది. 16 అగస్టున చిట్టగాంగులో హిందువులు - ముస్లింలు కూడా హర్తాళ్‌లో పాల్గొన్నారు. ఆరోజున రెండు మతాలవారు 50 వేలమంది బహిరంగసమావేశంలో గలిశారు. అక్కడ ముస్లింలీగ్ కార్యదర్శి హిందువులపై విషం గ్రక్కాడు. ఉద్రేకాలు ప్రబలినాయి.

ఆమరునాడే రామమనోహర లోహియా మీటింగుమీదపడి ముసల్మానులు దానిని చెదరగొట్టివేశారు, లోహియాను కమ్యూనిస్టుపార్టీ కాపాడిదాచింది. అక్కడనుంచి ఆ మూక కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుమీద పడింది.

అక్కడవున్న కామ్రేడ్స్ 2 గంటలసేపు అల్లరి మూకని నిలవబెట్టారు. ఈ లోపున జిల్లా మాజిస్ట్రేటు నాలుగుమార్లు ఆ వీధిలోనుంచే అటు ఇటూ తిరిగాడు. 50 గజాల దూరంలోవున్న పోలీసు స్టేషనుకు కబురువెళ్ళినా, వారు కలుగజేసుకొన నిరాకరించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు అతుల్‌దత్త కమీషనర్ వద్దకు పరుగెత్తాడు. అతడు 'కాంగ్రెసు వాళ్ళ నడుగు' అనిచెప్పాడు.

కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులోని వారు ధైర్యసాహసములతో మూకను ఎదుర్కొని ఎనిమిదిమార్లు వెనక్కి తరిమికొట్టారు, చివరకి పైనుండి ఇవ్వబడిన ప్రోత్సాహంతో గూండాలు పార్టీ ఆఫీసును ధ్వంసం చేయగలిగారు. 3 వేల రూపాయల ఖరీదయిన లైబ్రరీ తగులపెట్టబడింది, ఆఫీసు సామానంతా 24 గంటలవరకు తగులబడుతూనేఉంది. ఫౌంటెన్ పెన్నులు, రిష్టువాచీలు, మఫ్లర్లు ఎత్తుకుపోయారు.

కామ్రేడ్ రణధీరదాస్‌గుప్త శరదిందు దస్తిదర్‌లను కత్తులతో పొడిచారు. దాస్‌గుప్తను స్మృతిలేని దశలో లారీలోకి ఎత్తి హాస్పిటలుకు తీసుకుపోతుంటే జిల్లా మాజిస్ట్రేటు వెక్కిరింపు గొంతుతో, పాపం దెబ్బ తగిలిందా అని పరామర్శించాడు,

ఈ విధంగా కమ్యూనిస్టుపార్టీ యుద్ధకాలంలో, కరువు, వరదలు మొదలైన ఉత్పాతాలు వచ్చిన కాలంలో నిర్మించుకువచ్చిన ఐక్యతను లీగులోని అభివృద్ధి నిరోధకుల సహాయంతో జిల్లా మాజిస్ట్రేటు భగ్నం చేయగలిగాడు.

ఇప్పుడుకూడా అటు కాంగ్రెసువాదులను, ఇటు లీగునాయకులను అదిరించి లాలించి వేరుగా నిలవబెట్టి అన్ని పార్టీలతో శాంతి సంరక్షకసంఘం ఏర్పడకుండా చేస్తున్నారు.

సోవియట్ యూనియన్‌లో ★ ★ ★ ★ అనాధ బాలబాలికలకు రక్షణ

యుద్ధ ఫలితంగా ప్రజలను అనేక భయంకర సమస్యలు ఎదుర్కొంటాయి. యుద్ధంలో లక్షలకొలది ప్రజలు చచ్చిపోతారు. లక్షలకొలది బాలబాలికలు తల్లిదండ్రుల్ని కోల్పోయి అనాధులై అలమటిస్తూవుంటారు. అలాంటి అనాధ బాలబాలికల్ని సంరక్షించడం, యుద్ధానంతర కర్తవ్యాల్లో ఒక అత్యంత ప్రధానమైన సమస్య. ఈ సమస్యను సోవియట్ యూనియన్ ఎంత చక్కగా పరిష్కరిస్తూవుందో చూద్దాం.

ఫాసిస్టుహిట్లరు సైన్యాలు రష్యాలో వందలకొలది గ్రామాల్ని స్మశానంగా మార్చివేశాయి. లక్షలకొలది ప్రజల్ని చిత్రవధ చేశాయి. ప్రపంచంలో మరే దేశంకూడా ఇప్పటిదాకా యుద్ధనష్టానికి గురికాలేదు. ఇంత విపరీత నష్టాన్ని సహించికూడా సోవియటు యూక్రెయిన్ అనాధ బాలబాలికల విషయమై ఎంతో శ్రద్ధతీసుకుంటూవుంది. ఇల్లూ వాకిలీ లేక బజారులవెంట తిరిగి భిక్షమెత్తుకునే వాళ్ళు సోవియట్ యూనియన్‌లో లేరు. అనాధ బాలబాలికలందరికి ప్రభుత్వమే ఆశ్రయమిస్తుంది. చక్కని వసతి సౌకర్యాలు కల్గిస్తుంది. విద్యాబుద్ధులు గరపుతుంది. ఉత్తమ పౌరులుగా తయారు చేస్తుంది.

అనాధ బాలబాలికలకు ఆశ్రయాలు

అనాధ బాలబాలికల విషయమై సోవియటు ప్రభుత్వం ఎంతో జాగ్రత్త తీసుకుంటుంది. ఈ విషయం నేను స్వయంగా అనాధాశ్రయాలకు వెళ్ళి కండ్లారా చూచాను. ఆరోగ్య విద్యాశాఖ మంత్రులతో మాట్లాడినాను. ఇంకా అనేక క్రొత్త విషయాలు తెలుసుకోగలిగాను.

"అనాధ బాలబాలికలను రక్షించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి," అని 1943 లో సోవియట్‌యూనియన్ ఒక నిర్ణయంచేసింది. ఈ నిర్ణయం అయిన వెంటనే 20 వేల బాలబాలికలకు వసతి సౌకర్యాలు కలిగిస్తూ 145 అనాధాశ్రయాల్ని యూక్రెయిన్ ప్రభుత్వం నిర్మించింది. ఇందుకోసం ప్రభుత్వం 9 కోట్ల రూబుల్సు ఖర్చుపెట్టింది. పిల్లలకు కావాలిసినదంతా ఇచ్చింది, బట్టవస్త్రాలయిచేసింది. ఈ కర్తవ్యనిర్వహణలో సోవియట్ పౌరులు ప్రభుత్వానికి ఎంతో తోడ్పడ్డారు. అనేకమంది అనాధబాలబాలికల్ని దగ్గిరకుతీసి పోషించారు. పిల్లలులేని తల్లిదండ్రులు ఈ పిల్లల్నే తమ స్వంత పిల్లల్లాగా చూసుకున్నారు, అనాధబాలబాలికల్ని పెంచుతూఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ధనసహాయంచేసింది. ఈవిధంగా పెరుగుతూఉన్న బాలబాలికలు నేడు ఒక్క యూక్రెయిన్‌లోనే 80 వేలు ఉన్నారు.

ఇతర బాలబాలికలతోపాటు ఈ అనాధ బాలబాలికలు రోజూ స్కూలుకు వెళుతూ ఉంటారు. చదువుతోపాటు వీరికి చేతిపనులు కూడా నేర్పుతారు.

ప్రజల సహకారం

ఈ అనాధాశ్రయాల్ని పోషించడం ప్రభుత్వబాధ్యతే అయినప్పటికీ పౌరులుకూడా పూర్తిగా ఆర్థికసహాయం చేస్తారు. ప్రజాసంస్థలు విరివిగా విరాళాలు వసూలుచేసి వీటికి పంపిస్తాయి. ఈ విధంగా ప్రజాసంస్థల నుంచి పౌరులనుంచి అనాధాశ్రయాలకు ప్రతి నెల తప్పకుండా సహకారం లభిస్తూ ఉంటుంది. బెలయాజర్కోవ్‌లో ఉన్న ఒక అనాధ సంరక్షణాలయాన్ని నేను స్వయంగా దర్శించాను. పరిశ్రమలో బాలబాలికలందరికి కావలసిన దుస్తులు 180 జతల బూట్లు, బ్లాంకెట్సు అండర్‌వేర్సు, కుర్చీలు, బల్లలు వగైరా సామాన్లు అన్నిటినీ అచ్చటి స్థానిక కార్మిక సంఘమే సహాయం చేసింది ఈ విధంగా పిల్లలకు కావాలిసిన సహాయంలో ఎక్కువభాగం ప్రజాసంస్థలే చేస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకించిన ప్రభుత్వధనాన్ని బాలబాలికలకు ఇతర సదుపాయాల్ని కలిగించే నిమిత్తం ఖర్చుపెడుతూ ఉన్నారు.

అనాధ బాలబాలికల సంరక్షణ కోసమై స్టాలినో ప్రాంతంలోని కార్మికులు నెలవు రోజుల్లోకూడా పనిచేసి, అవచ్చిన డబ్బుని వీటికి విరాళంగాయిస్తూవున్నారు.

సోవియట్ యూనియన్‌లో ఇలాంటి ఉదాహరణలు అసంఖ్యాకంగావున్నాయి.

పిల్లలను సరియైన పద్ధతులతో పెంచాలి

యుద్ధంలో తల్లిదండ్రుల్ని గోల్పోయిన 7218 పిల్లల్ని ఈసంవత్సరం సోవియట్ పౌరులు దత్తుచేసుకున్నారు. బాలబాలికలను చిన్నప్పటినుంచి సరియైన పద్ధతులతో పెంచితే వారు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు. లేకపోతే వారి భావిజీవితం వ్యర్థమైపోతుంది. అందువల్ల దత్తుచేసుకోదలచుకొన్న తల్లిదండ్రులు భౌతికంగా, నైతికంగా యోగ్యులో కాదో ముందే కోర్టు నిర్ణయిస్తుంది. ఇదివరకే అనేకమంది పిల్లలున్న తల్లిదండ్రులుకూడా ఈ 'అనాధుల్ని' క్రొత్తగా మళ్ళీ దత్తు చేసుకుంటున్నారు.

చదువుచెప్పించే బాధ్యత సంరక్షకులదే

ఈ అనాధ బాలబాలికలకు 14 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు సంరక్షకులుగా (గార్డియన్స్) వుంటానికి ప్రభుత్వం యోగ్యులైన కొందరు పౌరుల్ని నియమిస్తుంది. పిల్లల్ని శ్రద్ధగాపెంచి కనీసం స్కూల్ ఫైనల్ వరకైనా చదువుచెప్పించే బాధ్యత ఆ సంరక్షకులదే ప్రభుత్వమే యిందుకు అవసరమైన ఆర్థికసహాయం అంతా చేస్తుంది. తిండి, బట్ట, పుస్తకాలు, ఇంకాకావలసిన ఇతరవస్తువులు అన్నీ ఉచితంగా సప్లయి చేస్తుంది.

అనాధాశ్రయాల్లో పిల్లల పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోడానికి ప్రభుత్వాధికారులు మధ్య మధ్య తనిఖీ చేస్తూఉంటారు. సంరక్షకులు పిల్లల్ని అజాగ్రత్తగా పెంచుతున్నారు అనితెలిస్తే వెంటనే ప్రభుత్వం అసంరక్షకుల్ని తొలగిస్తుంది.

సమిష్టివ్యవసాయ క్షేత్రాల్లో అనాధ బాలబాలికలు

సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు కూడా ఈ కార్యక్రమంలో ప్రభుత్వానికి ఎంతో తోడ్పడుతున్నాయి. సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో భాగస్వాములయిన సభ్యులందరు సమిష్టి బాధ్యతతోనే ఈ అనాధ బాలబాలికల్ని పెంచుతూఉంటారు. వీరికి, ప్రభుత్వానికి మధ్య దత్తు సంబంధమైన ఒక ఒడంబడిక జరుగుతుంది. సమిష్టి వ్యవసాయ క్షేత్రదారులు అనాధశిశువుల్ని సక్రమంగా పెంచుతున్నారో లేదో చూడడానికి ఆరోగ్య, విద్యా, శాఖా మంత్రుల ప్రతినిధులు ఎప్పుడూ అక్కడే ఉంటారు. వారికికావాలిసిన వైద్య, విద్యా, సౌకర్యాలు కలిగిస్తారు.

నేను అనేకమంది అనాధ బాలబాలికలతో స్వయంగా మాట్లాడాను. వారు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగావున్నారు. తాము 'అనాధులం' అనే విషయం వారు కలలో కూడా అనుకోరు. 'సోషలిస్టుప్రభుత్వం తమ జీవితాల్ని ఎంతో జాగ్రత్తగా కాపాడుతూంది, తిన తిండి, కట్ట బట్ట నిలవనీడలేక అవస్థపడవలసిన- అవసరం తమకు లేదు' అని వారికి బాగా తెలుసు. ఫాసిస్టుల చేతుల్లో తమ మాతృభూమి ఎంతో నష్టపడింది అనీ, తాము త్వరగా పెరిగి పెద్దవారై తమ ఋణాన్ని తిరిగి చక్రవడ్డీతోసహా తీర్చుకోవాలనీ, వారు ఉవ్విళ్ళూరుతున్నారు.

ప్రపంచంలో పిల్లలంత ఒకటే

అంటారు సోవియట్ పిల్లలు

ఆఫ్రికా అడవిలో నల్లని పిల్లలు ఆడుకుంటూ వారి కెవ్వరు నాయకుడుగా ఉండాలని త్రవ్వులాడుకుంటున్నారు. అంతలో ఒక చురుకైనబాలుడు ముందుకురికి మనలో ఎవరు బాగా పరుగెత్తగలరో, దూకగలరో, పాడగలరో వారిని నాయకుడుగా తీసికొందాం అని రాజీపడ్డారు.

వారిలో గొప్పవానిని ఎన్నుకుంటానికి పందెము లన్నిటిలో మొదటివాడుగా వచ్చిన వానిని నాయకుడుగా తీసికొన్నారు. ఆ పదేళ్ళ కుర్రాడు ఆ పిల్లలకందరికి ఆటల్లో, పాటల్లో, వేటాడటంలో సలహాలిస్తూ ఉన్నాడు. ఒకరోజు పిల్లాడు వేటాడ వెళ్ళాడు ఒంటరిగా. వాణ్ణి మ్రింగాలని బుసలుకొట్టుతూ వస్తున్న దొక కొండచిలువ. ఒక కోతి అది చూచి పాముపైబడి చంపి ఆ నీగ్రో బాలుడిని రక్షించింది. ఆ నాటినుంచి కోతి కుర్రాడు ఒకరి నొకరు విడువక వెంట వెంట తిరుగుతున్నారు.

ఇట్లా కొన్నాళ్ళు గడిచింది.

ఎవరో పరాయిదేశస్తులా దేశాన్ని చూడ్డానికి వచ్చారు. వారు వున్ని దుస్తులతో చేతుల్లో తుపాకులతో, ఖజానా సంచులతో ఆ ప్రదేశమంతా అన్వేషిస్తున్నారు. ఏమేమో చూచారు. ఏదేదో వ్రాసుకున్నారు. ఆ నల్లని పిల్లల్ని పట్టుకో ప్రయత్నించారు కాని ఎవరూ చిక్కలేదు కాని, కోతితో ఆడుకుంటూ యేమరచిఉన్న సమయంలో కోతి, పిల్లవాణ్ణి పట్టుకున్నారు. కుర్రాడు తప్పించుకొనిపోయాడు. కోతి బందీయై చిక్కింది. వాళ్ళు ఆ కోతిని తీసికొని ఒక నావెక్కి వెళ్ళారు. వారి నావపై నక్షత్రం, సుత్తి, కొడవలిజండా ఉంది.

నీగ్రోబాలుడు మరొక నావెక్కి వారిని వెంటాడాడు. నావ మాస్కో చేరింది. వాడు ఆ నగరంలో దిగాడు. విచిత్రమైన భవనాన్ని, చూచాడు. ఆశ్చర్యపోయాడు. అంతా కొత్తగా ఉంది. వాడికి ఆడుకుంటానికి యిష్టమైన పిల్లలు దొరకుతారేమోనని నలు ప్రక్కలా చూచాడు. కొంతదూరంలో పిల్లలబడి చూచాడు. పరుగెత్తాడు. వాళ్ళ భాష అర్థంకాలేదు. వెంటనే ఆపిల్లవాడ్ని అచ్చట బడిలోని పంతులు సమీపించాడు. బిత్తరపోయి చూస్తున్న బాలుడిని వోదార్చాడు. భోజనశాలకు తీసుకొనివెళ్ళి తిండి పెట్టించాడు. వాడు తిన్నాడుకాని వాడి కదంతా అగమ్యగోచరంగా వుంది. తరువాత కనుగొనగా వాడు ఆఫ్రికా పిల్లవాడని తెలిసింది. అప్పుడు ఆఫ్రికాలోకల్లా గొప్ప గాయకుడైన పాల్‌రోబ్సన్ అనుఅతను రష్యాలో తన సంగీతం వినిపించుటకై వచ్చియున్నాడు. అతనిని అకుర్రాడి విషయము జాగ్రత్తగా చూడమని వొప్పచెప్పాడా మాస్కో బడిపంతులు.

ఆ కుర్రాడు పాల్‌రోబ్సన్ యింట్లో వుంటున్నాడు. వారింట్లోవున్న ఆఫ్రికా పటమును చూచి, తన కోతిని తలచుకొని లోలోన విచారపడుతుండేవాడా బాలుడు. క్రమక్రమముగా ప్రక్కనున్న ఇండ్లలోని పిల్లలతో సహవాసంచేసాడు. ఒకరోజున వారితో కలసి ఒక సర్కసు చూడటానికి వెళ్ళాడు.

సర్కసుకు వెళ్ళారు. మొదటకొన్ని గుఱ్ఱపుపందెములు, డ్యాన్సులు మొదలైనవి చూచారు. సర్కసుఆట సగమైంది. అంతలో ఒక బక్కచిక్కిన కోతిని తీసికొనివచ్చారు రంగంమీదికి. అది కదలక మెదలక కూర్చుంది. కొరడాతో కొట్టాడాకోతిని సర్కసు యజమాని. నీగ్రోబాలుడు గుర్తించాడతనికోతిని. అతనివొళ్ళు జలదరించింది. సహించలేకపోయాడు. పేరుపెట్టిపిలిచాడాకోతిని. జనాన్నిత్రొక్కుకుంటూ దూకుతూవచ్చి నీగ్రోబాలుడివడిలో కూర్చుందాకోతి.

ఆఫ్రికా అడవిలోని పిల్లలంతా కోతి, తమనాయకుడు పోయినందుకు విచారంగా వున్నారు.

ఎప్పుడెప్పుడు తనదేశం చేరుకుందామని కుతూహలంగావుంది నీగ్రోబాలునికి. పాల్‌రాబ్సన్ అనుమతి తీసికొని తిరిగి ఆఫ్రికా వెళ్ళటానికి తయారయ్యాడు. మాస్కో బడిపిల్లలకాసంగతి తెలిసింది. అతనికి వీడ్కోలుసభ జరిపారు. మాస్కోపిల్లలు, తమ ఆశయాల్ని, ఆశీస్సుల ఆఫ్రికాలోని బాలురకందజేయవలసిందని చెప్పారు. కొన్ని బహుమతులు యిచ్చి వాటిని ఆఫ్రికా వెళ్ళినతర్వాత తన స్నేహితులకివ్వమని చెప్పి పంపారు.

నీగ్రోబాలుడు తనజన్మభూమిచేరాడు. పిల్లలంతా చుట్టుమూగారు. మాస్కో బాలురు యిచ్చిన బహుమతులనిస్తూ, ప్రపంచంలోని పిల్లలందరూ నలుపూ, తెలుపూ, భేదంలేకుండా సౌఖ్యమయ జీవితాలు గడపాలని వారు తెల్పిన ఆశీస్సుల నందజేశాడు.

అనువరణ: వుద్దులూరి రామకృష్ణ

జీవనభృతికోసం

లక్షాయాభైవేల నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల పోరాటం

(మా మద్రాసు విలేఖరి)

మద్రాసు రాష్ట్రంలో ఒక అపూర్వమైన పోరాటం జరుగబోతోంది. ఈ పోరాటానికి పూనుకునేవారు ఎవరంటే గవర్నమెంటు ఉద్యోగస్థులు. నిజంగా ఇలాంటిది మన స్వతంత్రపోరాట చరిత్రలోఎన్నడూవినలేదు. లక్షఏభైవేల గవర్నమెంటు ఉద్యోగస్తులు, గవర్నమెంటు యంత్రంనడపడానికిముఖ్యులు యీపోరాటంలో ప్రవేశించుతున్నారు.

ఈనాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు ఎవరు?

మద్రాసు అసెంబ్లీ ముస్లింలీగుపార్టీ ఉపనాయకుడైన బి. పోకర్ చెప్పినట్లు వారు ప్రభుత్వ యంత్రానికి వెన్నెముకవంటివారు. ఈ లక్ష ఏభై వేల ఉద్యోగస్తులలో నెలకు 100 రూపాయలు సంపాదించే ఆఫీసర్లు వెయ్యి మంది, నెలకు రు 35 లు సంపాదించేవారు 20 వేలమంది. రు. 35 లు లోపు సంపాదించేవారు 70 వేలకుపైగాను ఉన్నారు. వీరుగాక ఇంకా అనేకమంది మేస్త్రీలు, కూలీలు, పాకీవారు ఉన్నారు వీరికిచ్చే జీతాలు మరీ అధ్వాన్నంగాఉన్నాయి. ఎప్పటికప్పుడు వీలునుబట్టి మారుతూఉంటాయి. వీరికి పెన్షన్లులేవు. సెలవురూల్సు వీరికి అనువర్తించవు. ఇలావుంది వీరి పరిస్థితి.

వారి గ్రేడ్లు ఏమిటి?

అసోసియేషన్‌లోప్రముఖపాత్రవహించుతున్నవారు ఎక్కువ బాధలకు గురియవుతున్న గుమాస్తాలు, వారిక్రింద పనివారు. వీరంతా గూడా నెలలో ఆఖరువారంలో నియ్యం కొనుక్కోడానికి అప్పులకోసం వరిగెత్తవలసిన దౌర్భాగ్యస్థితిలో ఉన్నారు.

పట్టణంలోనున్న సెక్రేటరియటు గుమాస్తాల గ్రేడ్లు ఎలావున్నాయో చూడండి: 40 — $1\frac{1}{2}$ — 55 — $2\frac{1}{2}$ — 70. ఒక గ్రేడు. మరొకగ్రేడు 30 — $1\frac{1}{2}$ — 45 — 1 — 55.

సిటీలోనున్న గుమస్తాలకు రాష్ట్ర అలవెన్సు క్రింద 6-8-0 ఇస్తారు. అధికధరల అలవెన్సు క్రింద 16 రూ. ఇస్తారు. పై అలవెన్సులు 40 రూ. లోపువారికి. 40 రూ. పైవారికి 18 రూ. అలవెన్సు ఇస్తారు.

ఇక 70 వేల గుమస్తాలగతి ఎలావుందో క్రిందఇచ్చే వారి గ్రేడ్లుచూస్తే తెలుస్తుంది. 12 — $\frac{1}{4}$ — 13 — $\frac{1}{3}$ — 14 — $\frac{1}{6}$ — 16 అంటే 25 సంవత్సరాలు సర్వీసు చేసిన గుమస్తాకు చివరకు 17 రూ. జీతం ముట్టుతుందన్న మాట,

నాన్‌గెజిటెడ్ ఆఫీసర్లు ఈతక్కువజీతాలతో బాధపడలేక తమ అసోసియేషన్ ద్వారా గత 25 సం. నుంచి ఆందోళన చేస్తున్నారు. కాని గవర్నమెంటు ప్రతి తఫా 1923 లోనూ, 1933 లోనూ, 1938 లోనూ, ఆ జీతాలనే స్థిర పరచింది. ఒకప్రక్క జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినా గాని జీతాలు ఒక్కదమ్మిడీకూడా పెంచలేదు. (హిందూ) నాన్‌గెజిటెడ్ ఆఫీసర్సు అసోసియేషన్ యొక్క రికగ్నిషనను తీసివేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై సంపాదకీయంలో ఇలా వ్రాసింది. యుద్ధం రాకముందు 1930 ప్రాంతాలలో ఇచ్చిన ఈ జీతాలు ప్రస్తుత పరిస్థితులలో ఏమీ చాలవు. జీవిత పరిమాణం అప్పుడు 100 వుంటే ఇవుడు 188 అయింది, ఈ విషయాన్ని ప్రధానిగారే అంగీకరించారు. ధరలు ఈ విధంగా పెరిగిపోయినప్పటికీ అధిక ధరల అలవెన్సులతో సహా నూటికి 20 లేక 30 కంటె ఎక్కువగా జీతాలు పెరగలేదు. బి. తరగతిఉద్యోగులకుమాత్రం 100కి 38 పెరిగింది. కాని వారి జీతాలు 30 నుంచి 55 రూ వరకు మాత్రమే ఉన్నాయని మనం తెలుసుకున్నపుడు ఈ పెరుగుదల ఎంత తక్కువో తెలుస్తుంది. ఈ పరిస్థితులలో ప్రభుత్వం 40 రూ. తక్కువవారికి నెలకు మూడు రూపాయలను, 40 రూ. పైవారికి నెలకు 4 రూ. లను తాత్కాలికంగా ఇవ్వ డకు నిర్ణయించింది. కాని ఆ పెరుగుదల తక్కువజీతాలలో చచ్చిపోతున్న ఉద్యోగస్తుల జీవితంలో ఏమీ మార్పు తీసుకురాలేదు.

కమిటీ సిఫార్సులను బుట్టదాఖలు చేశారు

1944 లో అద్వైజర్ల ప్రభుత్వమే ఒక జీతాల కమిటీని నియమించింది, ఆ కమిటీ ఉద్యోగస్తుల జీతాలు పెంచాలని సిఫార్సు చేసింది. ఆ కమిటీ ఈ దిగువ సిఫార్సులు చేసింది. 15 రూ లోపువారికి నూటికి $33\frac{1}{3}$ రూ చొ॥న, 15 నుంచి 50 రూ. వరకు సంపాదించేవారికి నూటికి 25 చొ॥న, 50 నుంచి 200 రూ. సంపాదించేవారికి నూటికి 20 చొ॥న పెంచాలని సిఫార్సుచేసింది, రాష్ట్ర సర్వీసులలో ఉండేవారికి 250 రూ.తో జీతం ప్రారంభం కావాలని సిఫార్సు చేశారు.

కాని, ఈ సిఫార్సులన్నీ బుట్టదాఖలయినాయి. యుద్ధ పరిస్థితులు, నేటి యుద్ధానంతర పరిస్థితులుకూడా ఈఉద్యోగులందరిని చైతన్యపరిచాయి. కష్టపడే ఇతర జనసామాన్యంతో పాటు వారుకూడా తమకోర్కెలను ప్రభుత్వం ముందు పెట్టారు. నేడు దేశంలోవచ్చిన ప్రజాపెల్లువ, కార్మికులు తమ కనీసకోర్కెల కోసం సాగించే పోరాటాలు, ఈ ఉద్యోగస్తులను ఉత్తేజపరచాయి. ఈ పరిస్థితిలో కాంగ్రెసు మంత్రివర్గం వచ్చేసరికి తమ కోర్కెలీడేరతాయని ఆశపడ్డారు. కాని, వారి ఆశలు నిష్ఫలమైపోయాయి.

లక్షయాభై వేల ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే 1600 మంది ప్రతినిధులు మద్రాసు దగ్గర గిండీలో సమావేశమయ్యారు. తమ కోర్కెలను ఆగస్టు 25వ తేదీలోగా తీర్చకపోతే సమ్మెచేయవలసివస్తుందనిహెచ్చరించారుతమ కోర్కెలను మంత్రివర్గానికి తెలియపర్చారు. తాత్కాలిక ఏర్పాటుగా తమ జీతాలను రెట్టింపు హెచ్చించాలనికోరారు (50రూ మించకుండా) చాలఎక్కువమంది ఉద్యోగులు 35 రూ కన్న తక్కుజీతం, 16 రు. అధికధరల అలవెన్సు మాత్రమే సంపాదించు తున్నారన్న విషయం చూస్తే పైకోర్కె ఎంత న్యాయమైనదో తెలుస్తోంది.

ప్రజలముందు ప్రభుత్వంముందు తమ కోర్కెలుంచారు

మంత్రివర్గం రాగానే వారు ఒకమెమొరాండం ఇచ్చారు. వారిజిల్లా మహసభల ద్వారా వారికోర్కెలను ప్రజలముందు, ప్రభుత్వం ముందు పెట్టారు. మరల సెప్టెంబరు 8 వ తేదీన మద్రాసులో పెద్దఊరేగింపు జరిగింది. 10 వేలమంది ఉద్యోగులు సమావేశమై తమ కోర్కెలను మరొకసారి ఉద్ఘాటించారు. ఉద్యోగులు, గుమాస్తాలు, బంట్రోతులు అందరూ కూడా ఈ దిగువ మాటలు వ్రాయబడిన బాడ్జీలు పెట్టుకుని ఊరేగింపులో ప్రవేశించారు "తక్కువజీతం, ఎక్కువపని నిర్లక్ష్యం చేయబడిన, ఆకలిమంటలకు గురియవుతున్న, గవర్నమెంటు వుద్యోగి" ఈ మాటలలోనే వున్నాయి వారిబాధలన్నీ.

కాని ప్రభుత్వం మాత్రం ఈ కోర్కెలు తీర్చాలన్న విషయాన్నిగుర్తించలేదు. బడ్జెటు పూర్తిచేసిన తరవాత మీరువచ్చారనేసాకుతో మేమేమీ చేయలేమని అసోసియేషన్ ప్రతినిధులతో ప్రభుత్వం చెప్పింది, చివరకు ప్రజలఒత్తిడికి లొంగి ఒక కమిటీని ఏర్పరచారు. కాని గిండీలో జరిగిన మీటింగులో తాము ఏమి చేయదలచుకుంటున్నారోకూడా ప్రభుత్వం చెప్పలేకపోయింది. కాని చివరకు నెలకు, 3. 4, రూ. హెచ్చించుతున్నామని, అది ఆగస్టునుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. కాంగ్రెసు మంత్రులు ఇస్తామన్న ఈ హెచ్చుదల ఎంత తక్కువో ఒక ఉదాహరణ ఇస్తే సరిపోతుంది.

కేంద్ర ప్రభుత్వం నెలకు 8-4-0 చొ॥న 15 నెలలపాటు తాత్కాలికంగా ఇవ్వాలని నిర్ణయించింది. ఇండియా రిజర్వుబ్యాంకు ఈ క్రింది విధంగా జీతాలు హెచ్చించింది.

60—4—100 గ్రేడువారు, 100—$7\frac{1}{2}$—175 గ్రేడుకు మార్చబడ్డారు. 50 — 3 — 95 గ్రేడువారు 75 — 5 — 120 గ్రేడుకు మార్చబడ్డారు. ఈ పరిస్థితులలో అసోసియేషన్ ఏమిచేయాలి? సమ్మె తప్పవేరే మార్గం కనబడటంలేదు.

కోర్కెలు తీర్చకపోగా అసోషియేషన్ పై దాడి

ప్రభుత్వానికి అసోసియేషన్ ఒక నెల టైము ఇచ్చింది. కనీసం కేంద్ర ప్రభుత్వం చేసిన సిఫార్సుల ప్రకారమైనా తాత్కాలిక ఏర్పాటు చేయమని కోరారు. ఈ హెచ్చుదల 1946 జూన్ నుంచి ఇవ్వమని కోరారు.

కాని ఇదంతా చెవిటివానిముందు శంఖం వూదినట్లఉంది. పైగా అసోసియేషన్‌మీద దాడి ప్రారంభించింది. సిగ్గువిడిచి ప్రకాశంగారు మద్రాసు అసెంబ్లీలో ఒక ప్రకటన చేశారు. ఉద్యోగులు రాజకీయాల్లో పాల్గొనకూడదట. ఈ విషయాన్ని ఇవుడూ, ఎప్పుడూ కూడా ఉద్యోగులుకూడా గుర్తించాలి. అసోసియేషన్ యొక్క రికగ్నిషన్ తీసివేశారు. సమ్మె నోటీసు ఇవ్వడం ప్రభుత్వ వ్యతిరేకమట. అప్పుడే అర్హత, అనర్హత లపై చర్య తీసుకుంటామంటున్నారు.

ఈ పరిస్థితులలో ఎంతకాలం ఈ తక్కువజీతాలఉద్యోగస్తులు ఈకష్టాలను భరించగలరు. వారు సంఘాన్ని బలపర్చుకున్నారు. 25 జిల్లాలలో 80000 మంది ఉద్యోగులు అసోసియేషన్‌లో చేరారు. వారి కోర్కెలను ప్రజలముందు పెట్టారు. అసెంబ్లీలో, కొంతమంది కాంగ్రెసు వారు వారి కోర్కెలను బలపర్చారు. యస్. వరదాచారిగారు నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ గుర్తించాలని కోరారు, ముస్లింలీగు పార్టీ ఉపనాయకుడైన పోకరు, కమ్యూనిస్టు యం. యల్. ఎ. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు వారి కోర్కెలను పూర్తిగా బలపర్చారు. కమ్యూనిస్టుపార్టీ ఈ ఉద్యోగుల చైతన్యాన్ని అభినందించి వారికోర్కెలను పూర్తిగా బలపరుస్తూ తమ ప్రజాశక్తిలో ప్రకటించింది.

పార్టీ కమిటీలకు విజ్ఞప్తి

కామ్రేడ్స్, ఈక్రింది ఏజన్సీలు బాకీలు డిపాజిట్లు చెల్లించనందున ఆపుచేయబడినవి. స్థానికపార్టీ కమిటీలు వెంటనే శ్రద్ధతీసుకొని, బాకీలు వంపేటట్లు చూడాలి,

మానేజరు,

"ప్రజాశక్తి"

బాకీలు డిపాజిట్లు యింతవరకు పంపని ఏజన్సీలు :-

1. రామచంద్రపురం 2 పెద్దాపురం 3 గుడ్లవల్లేరు 4 కైకలూరు 5 ఉండి 6 నూజివీడు 7 తిరువూరు 8 దాచేపల్లి 9 నర్సారావుపేట 10 పెదవడ్లపూడి 11 సత్తెనపల్లి (జాయింటు బాకీ) 12 వినుకొండ 13 కావలి 14 కోవూరు 15 తిరుపతి 16 నంద్యాల 17 పాత్యం.

డిపాజిట్లులేని ఏజన్సీలు :-

1 నర్సపూర్ (కొంతభాగం) 2 తణుకు 3 భీమవరం (కొంతభాగం) 4 కంచికచర్ల 5 కొండపల్లి 6 అప్పంపేట 7 చీరాల 8 భట్టిప్రోలు 9 మంగళగిరి 10 పెద్దకూరపాడు 11 వేలూరు 12 నెల్లూరు 13 మదనపల్లి 14 కర్నూలు.

రష్యా విదేశాంగ నీతి

(14 వ పేజీ తరువాయి)

ఒక కొత్త నిందను సృష్టించారు. అది ఏమంటే, సోవియట్ సామ్రాజ్యకాంక్షతోనే ఇదంతా చేస్తోందట!

నిజానికి సామ్రాజ్య కాంక్ష ఎవరికుంది? గ్రీసులో ప్రజలపై మిలటరీ బలాన్ని ఉపయోగించి రాజును తిరిగి తెచ్చి పట్టం గట్టుతున్నదెవరు? ఇండోనీషియాలో సైన్యాలను పెట్టి ఆ దేశాన్ని తిరిగి డచ్‌వారికి బానిసగా అప్పగించ జూచుచున్న దెవరు? పాలస్థయిన్‌లో యూదులపై అరబ్బులను ఉసి కొల్పుతున్న దెవరు? భారతదేశంలో కాంగ్రెసు లీగులకు తగవులను పెంచుతున్నదెవరు? బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కాదా? తమ రంకులు కప్పిపుచ్చుకోడానికి "సోవియటు సామ్రాజ్య కాంక్ష" అని వినాదం లేవదీస్తున్నారు. పై దేశాలన్నిటిలోను సోవియట్ యూనియన్ ప్రజా ఉద్యమాలను బలపర్చింది. నిర్బంధ విధానాన్ని ఖండించింది. బాల్కన్ దేశాలలో ప్రజా పోరాటాలను బలపరచి అక్కడి పెట్టుబడిదారీ, జమీందారీ ప్రభుత్వాలను కూలదోసి ప్రజాప్రామ్యప్రభుత్వాలను నెలకొల్పడానికి తోడ్పడింది.

ఈసత్యాన్ని మనం గుర్తిస్తే సామ్రాజ్యవాదులు చేసేఅసత్య ప్రచారం ఏమిటో ఎందుకో అర్థమవుతుంది.

గత 29 ఏళ్ళనుంచి చేస్తున్నట్లుగానే, ప్రజా ఉద్యమాలను చీల్చడానికి, తికమక పెట్టడానికి సామ్రాజ్య వాదులు సోవియట్ వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు.

దీనికి మొదటినుంచి సోవియట్ ఇచ్చే సమాధానం కూడా ఒకటే. ప్రతిదేశంలోనూ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా. స్వాతంత్ర్యంకోసం జరిగే ప్రజావుద్యమాలను బలపర్చడం ప్రపంచ ప్రజలందరికి స్వాతంత్ర్యం కోసం, సమానత్వం కోసం. శాంతికోసం, సామ్రాజ్యవాద నిర్మూలనకోసం కృషిచేయడమే సోవియట్ ఆశయం. అదే సోవియట్ విదేశాంగ విధానంలోని ప్రధానసూత్రం

అన్యదేశాల స్వాతంత్ర్యోద్యమాలను బలపర్చడమే సోవియట్ విదేశాంగనీతి

మొదటి ప్రపంచ యుద్ధం అయిన తరువాత సామ్రాజ్యవాదులు ప్రపంచమంతట ఒక విప్లవోద్యమాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. నాలుగేళ్లు సాగిన ఆయుద్ధంలో సామాన్య ప్రజలుఅనేక దురవస్థలకు లోనయారు.లక్షల కొలది మరణించారు. కాని లాభం పొందినది సామ్రాజ్యవాదులుమాత్రమే. కోట్లకొలది లాభాలు గడించారు. కొత్తదేశాలపై అధికారం సంపాదించారు. అందుచేత యుద్ధానంతరం ప్రతిదేశంలోను ఒకనూతనచైతన్యం ప్రజ్వరిల్లింది. రష్యాలో కార్మిక, కర్షక విప్లవం వచ్చింది. చైనాలో సన్ యట్ సేన్ ప్రజలకు నాయకుడుగా పైకి వచ్చాడు. టర్కీలో కెమల్ పాషా అధికారంలోకి వచ్చాడు. విజయవంతం కాకపోయినా జర్మనీలోను, హంగరీలోను విప్లవాలు వచ్చాయి. మన భారతదేశంలో సత్యాగ్రహోద్యమం వచ్చింది. బ్రహ్మాండమైన కార్మిక సమ్మెలు వచ్చాయి.

ఇవన్నీ స్వాతంత్ర్యంకోసం దోపిడిచేసే అధికార వర్గాలను కూలదోయడానికి ప్రపంచ ప్రజా సామాన్యం గావించిన పోరాటంలోని భాగాలే.

సామ్రాజ్యవాదులు బోల్షివిజాన్ని రూపుమాపాలి అనే వంకతో ఈ స్వాతంత్ర్య పోరాటాలను అణచడానికి పూనుకున్నారు. సోవియట్ ను ఏమీ చేయలేకపోయారు. కాని మిగతా దేశాలలోని ఉద్యమాలనుమాత్రం తాత్కాలికంగా అణచగలిగారు.

వారి ప్రయత్నాలు అంతటితో ముగియలేదు. రెండో ప్రపంచయుద్ధం వచ్చేటంత వరకూ, ఆ మధ్యకాలమంతా సోవియట్ యూనియన్ ను నాశనం చేయాలనే కుట్రలతోనే గడిపారు.

కథ అడ్డంతిరిగింది

కాని వారిఆటలు సాగలేదు. సోవియట్ వ్యతిరేక యుద్ధానికిఐదులు తాము పాలుపోసి పెంచిన నాజీసర్పం హిట్లరుతోనే యుద్ధం చేయవలసి వచ్చింది: ధనం. ఆయుధాలు అన్నీ ఇచ్చి ప్రోత్సహిస్తే చివరకు హిట్లరు సోవియట్ మీద పడకుండా మొదట సామ్రాజ్యవాదులమీదకే దుమికాడు. ఆతరువాత సోవియట్ మీదికి వెళ్ళాడు.

హిట్లరు సోవియట్ మీదికి యుద్ధానికి దిగినప్పుడు మళ్ళీ ఈ సామ్రాజ్యవాదులలో ఆశలు మొలకలెత్తాయి.

ఈ దండయాత్రతో సోవియట్ బలహీన పడిపోతుందనీ, చివరకు తామే ప్రపంచంలో బలవత్తరమైన రాజ్యాలుగా పైకి రావచ్చునని ఆంగ్లో, అమెరికన్ సామ్రాజ్యవాదులు ఆశించారు.

ఆశలు ఫలించలేదు

పాపం! వారి ఆశలు అడియాసలయాయి. వారి అంచనాలు తప్పాయి. బలహీన పడటానికి బదులు సోవియట్ ఇదివరకెన్నడూ లేనంత బలవత్తరమైన దేశంగా తయారైంది.

అంతేకాదు. రెండో ప్రపంచ యుద్ధానంతరం మళ్ళీ ఎక్కడచూచినా విప్లవోద్యమాలు బయలుదేరాయి. ఈ ఉద్యమాలలో మళ్ళీ సామాన్య ప్రజలే ప్రముఖపాత్ర వహిస్తున్నారు. యుద్ధకాలంలో వాగ్దానం చేసిన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం అమలు జరపమని కోరుతున్నారు.

ప్రజలు ముందడుగు వేస్తున్నారు

హిట్లరును ఓడించడానికి ఐక్యమై ముందుకువచ్చిన తూర్పుయూరప్ ప్రజలు మరో అడుగు ముందుకు వేశారు. తమదేశాలలో దోపిడీ వర్గాలైన పెట్టుబడిదారీ ప్రభుత్వాలను కూలదోసి నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకోడానికి పోరాటాలు సాగించారు.

అనియాఖండంలోను ఇండొనీషియాలోను, ఇండో చీనాలోను సామ్రాజ్యవాదుల ప్రభుత్వాలకు స్వస్తిచెప్పి ప్రజలు తమ స్వతంత్ర ప్రభుత్వాలను నెలకొల్పుకున్నారు.

భారత దేశంలో గత 18 నెలలనుంచి బ్రహ్మాండమైన ప్రజాఉద్యమం సాగుతోంది. నావికుల తిరుగుబాటు. అజాద్ హింద్ ఫౌజు నాయకుల విడుదల కోసం ప్రదర్శనాలు. ఇప్పుడు వస్తున్న సమ్మెలవెల్లువ. ఇవన్నీ కోట్లకొలది సామాన్య ప్రజలను పోరాటంలోకి తీసుకువస్తున్నాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచమంతటా ప్రజాసామాన్యం నేడొకబ్రహ్మాండమైన స్వాతంత్ర్య పోరాటాన్ని సాగిస్తున్నది.

సామ్రాజ్యవాదుల ప్లాను

సామ్రాజ్యవాదులు ఇదంతా కనిపెట్టుతూనే వున్నారు. ఈనాడు వారు ఈఉద్యమాలను నాశనంచేయసంకల్పించుకున్నారు.

"బోల్షివిజాన్ని నాశనం చేయాలి" అనే బూజుపట్టిన పాతనినాదంతోనే మరోప్రపంచ యుద్ధాన్ని తెచ్చిపెట్టి ఈ ప్రజాఉద్యమాలను దానిలో భస్మీపటలం గావించాలనివారిప్లాను.

హూగెన్ బర్గ్ నేడు బ్రిటిషువారికి సలహాదారుగా పనిచేస్తున్నాడు. జపానులోకూడా, మెకార్థర్ క్రిందనున్న మంత్రివర్గం అంతా పాత ఫాసిస్టుముఠాయే. ఆ పెట్టుబడిదార్లే, ఆ జమీందార్లే నేడూ అధికారంలోవున్నారు.

బాల్కన్ దేశాలలోకూడా నేడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు మిత్రులుగా వున్నవారెవరోకూడా చూడండి. ఇదివరలోకూడా బ్రిటిష్ వారి ఏజంట్లుగానే వుంటూ హిట్లరును బలపర్చినవారే ఈనాడుపని చేస్తున్నారు. కాని ఎన్ని చేసినా బాల్కన్ దేశాలలో ఏమీ చేయలేక, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు గ్రీస్ మీద పడ్డారు. తమ సైన్యాలను పంపి, గ్రీసులోని జమీందార్లను అధికారంలోకి తెచ్చారు. గ్రీసు ఉపప్రధాని క్విస్లింగియనాస్ గొనోటాస్ చరిత్రే అందుకు నిదర్శనం. 1939 కి పూర్వం ఇతడు బ్రిటిష్ ఏజెంటుగా వుండేవాడు. 1940 లో హిట్లర్ వ్యతిరేకరహస్య ఉద్యమాన్ని అణచడానికి జర్మన్లు ఆర్గనైజు చేసిన పోలీసుదళాలకు సహాయం చేసిన ప్రబుద్ధుడు. నేడు మళ్ళీబ్రిటిషువారి ఏజంటు, ఉపప్రధాని అయి కూర్చున్నాడు.

ఇరాన్, ఇరాక్, ఈజిప్టు మొదలయిన మధ్యప్రాచ్య దేశాల్లో బ్రిటిషు సామ్రాజ్యవాదులు, అమీరులమీద, జమీందార్లమీద ఆధారపడి ప్రజాఉద్యమాలను అణచాలని ప్రయత్నిస్తున్నారు.

బ్రిటన్ కూడా అన్నిదేశాలలోను తన సైన్యాలనుంచింది.

సోవియట్ యూనియన్ ప్రజాస్వామ్యాలను బలపర్చుతోంది

సోవియట్ యూనియన్ ఈ ఎత్తులనన్నిటినీ గమనించుతూనేవుంది. వారి చర్యలన్నిటినీ కనిపెట్టుతూనేవుంది.

సోవియట్ విదేశాంగనీతి, ఈ మూడో ప్రపంచయుద్ధకుట్రదారుల ఆటలు సాగకుండా అరికట్టేదిగానేవుంది.

అందుచేతనే ప్రపంచమందన్నిచోట్ల ప్రజాస్వామికోద్యమాలను బలపర్చుతోంది. వీలున్నచోటల్లా ప్రజలపై సామ్రాజ్యవాదుల దాడిని విరోధించుతోంది. తూర్పు యూరప్ దేశాలలో బ్రిటిష్ - అమెరికన్ సైన్యాలు వెళ్ళి కలుగజేసుకోడానికి వీలులేదని సోవియట్ అటకాయించింది. దీనివల్ల ఆదేశాల ప్రజలు, జమీందార్ల, పెట్టుబడిదార్ల నడుములు విరగగొట్టగలిగారు. ప్రజా ప్రభుత్వాలను నెలకొల్పుకోగలిగారు. సాగుచేసే రైతులకందరికి భూమి లభించింది. పరిశ్రమలు ప్రభుత్వపరం గావించబడ్డాయి. తూర్పు యూరప్ దేశాలు సామ్రాజ్యవాదుల చేతిలో లేకుండా విముక్తిచెందాయి. సోవియట్ అధీనంలోవున్న జర్మనీలోను, కొరియాలోను జమీందార్ల ఎస్టేటులు లాగుకోబడ్డాయి. ముఖ్యమైన పరిశ్రమలన్నీ ప్రభుత్వపరం చేయబడ్డాయి. ఈకార్యక్రమంద్వారా అక్కడి ప్రజాఉద్యమాలు ఎంతో బలపడ్డాయి. సోవియట్ అధీనజర్మనీలో నేడు కార్మికసంఘాల సభ్యత్వం 30 లక్షలకు పైగావుంది. కొరియాలో 10 లక్షలకుపైగా వుంది.

తాను స్వయంగా కలుగజేసుకోడానికి వీలులేని ఇతర దేశాలన్నిటిలోను సోవియట్ యూనియన్, ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల యుద్ధపు ఎత్తులను, విప్లవ వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు బట్టబయలు చేస్తోంది. ఈ సామ్రాజ్యవాదులతో పోరాడే ఆయా దేశాల ప్రజాఉద్యమాలకు ఆవిధంగా ప్రోత్సాహమిస్తోంది. ఇండోనీషియా, గ్రీసులలో కుట్రలు ఆంగ్లో-అమెరికన్ ఆక్రమిత జర్మనీ. జపానులలో ఫాసిస్టులకు సహాయము చేయడం, చైనాలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టి ఆయుధాలివ్వడం. భారతదేశంలో బ్రిటిష్ కుట్రలు మొదలైన అన్నిటిమీద సోవియట్ పత్రికలు అనేక పర్యాయాలు విమర్శిస్తూ వ్రాశాయి. హెచ్చరికలు చేశాయి.

సోవియట్ యూనియన్ మిత్రరాజ్యసమితిలోకూడ ప్రతి సమస్యమీద సామ్రాజ్యవాదుల ప్లానులను ఎదిరించి పోరాడుతోంది. ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలన్నిటిని భగ్నంచేయడానికి అన్ని దేశాల ప్రజలను సమీకరింపడానికి కృషిచేస్తోంది.

ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలన్నిటికి సోవియట్ చెప్పే సమాధానం ఒక్కటే. అది, ప్రతిదేశంలోని ప్రజా ఉద్యమాలను బలపర్చడం. ఆ స్వాతంత్ర్యోద్యమాలను అణచడానికి సామ్రాజ్యవాదులుచేసే ప్రయత్నాలన్నిటినీ బట్టబయలు చేయడం.

కొత్త నింద

తమ కుట్రలు బయటపడి పోతున్నాయనే భయంతో సామ్రాజ్యవాదులు సోవియట్ పై

(మిగతా 13 వ పేజీలో)

మోహన్ కుమారమంగళం

సోవియట్ ఎమరెత్తు

సోవియట్ యూనియన్ కూడా ఇదంతా కనిపెట్టుతూనేవుంది. ప్రపంచమంతటా ఈ ప్రజాఉద్యమాలను బలపర్చ సంకల్పించుకుంది. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా కాపాడడానికి, సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచ ప్రజలందరికి, శాంతి, సౌఖ్యం, స్వాతంత్ర్యం, సమానత్వం నెలకొల్పడానికి అదొక్కటే మార్గం. అవనికి పూనుకున్నదికూడ సోవియట్ యూనియన్ ఒక్కటే.

నేడు, సామ్రాజ్యవాదుల విదేశాంగనీతికి. సోవియట్ విదేశాంగనీతికివున్న వ్యత్యాసం ఇదే.

సోవియట్ వ్యతిరేక యుద్ధానికి ప్రయత్నాలు

ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు రాజకీయంగాను, మిలిటరీగాను తమ యావచ్ఛక్తినీ, మూడో ప్రపంచయుద్ధాన్ని తెచ్చే కార్యక్రమంలోనే కేంద్రీకరించుతున్నారు. తద్వారా సోవియట్ యూనియన్ ను, ప్రపంచ ప్రజా ఉద్యమాలను అణచవచ్చునని వారి ఆశ.

అందుచేతనే ప్రతిదేశంలోనూ, విప్లవ వ్యతిరేకులకు, పెట్టుబడిదారీ, జమీందారీ వర్గాలకు సహాయం చేస్తున్నారు.

వెనుక, జర్మనీలోను జపానులోను ఫాసిస్టులను బలపర్చి, వారిని అధికారంలోకి తెచ్చినవదీ, వీరేనని మనం మరచిపోకూడదు. ఈ రోజునకూడా ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల అధీనంలోవున్న పశ్చిమ జర్మనీలో. ఆ ఫాసిస్టుశక్తులే స్వేచ్ఛ ననుభవిస్తున్నాయి. ఇంకాఅధికారంలోనేవున్నాయి. ఉదాహరణకు: బ్రిటిష్ అధీనంలోనున్న జర్మనీలో, పూర్వం నాజీ ప్రభుత్వంలో అర్థికమంత్రిగావున్న హిట్లరు ప్రియమిత్రుడు

ఇక ఆసియాకి వద్దాం. ఇండోనీషియా ప్రజాస్వామ్య సైనికబలం ఉపయోగిస్తున్నారు. చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన నడుపబడుతున్న ప్రజాసైన్యాలను నాశనం చేయాలని అమెరికా, అభివృద్ధివిరోధకులైన కొమింటాంగుపార్టీకి ఆయుధాలు సప్లయి చేస్తోంది

భారతదేశంలో బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రజలకు స్వాతంత్ర్యం యివ్వకుండ కాంగ్రెసు-లీగులను ఒకదానిపై ఒకటిని పురికొల్పుతూ తమ సైన్యాలను ఇక్కడే వుంచుతున్నారు.

మిత్రరాజ్యసమితిలో చూస్తే, సోవియటుకు వ్యతిరేకంగా గ్రీసు, హాలెండు బ్రిటిషు డొమినియన్లు, చైనా మొదలైన దేశాలతో ఒక ముఠాను తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

మిలిటరీ సన్నాహాలు

ఆవిధంగా ఒకవక్క రాజకీయంగా ఎత్తులు వేస్తూ మరోవక్క మిలిటరీ సన్నాహాలు చేస్తున్నారు.

ఈమధ్య ఇద్దరు అమెరికా పత్రికా విలేఖరులు న్యూయార్కు "హెరాల్డు ట్రిబ్యూన్" అనే పత్రికలో వ్రాసినదానినిబట్టి అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్లాను మనకి బోధపడుతుంది.

సోవియట్ యూనియన్ చుట్టూ విమానాశ్రయాలు నిర్మించి మధ్యన ఇరుకునబడేటట్లు చేయాలని, అలా చేసినట్లయితే, యూరపియన్ రష్యా, యూరల్ పర్వతాలలోని సోవియట్ పరిశ్రమలు తమ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివుండేటట్లు తమ గుప్పెట్లో పెట్టుకోవచ్చునని వారిప్లాను. ఈ ఎత్తులతోనే నేడు 60 దేశాలలో అమెరికా సైన్యాలు వుంచబడ్డాయి. అమెరికాకు 6 వేలమైళ్ళదూరాననున్న సౌదీ-అరేబియాలో కూడ అమెరికన్ సైన్యాలను పెట్టారు. అలాగే

మరో ప్రపంచయుద్ధానికి యుద్ధోన్మాదుల ఉబలాటం

బైరన్సు – చర్చిల్ ప్రబుద్ధుల కుటిలనీతి

అమెరికా విదేశాంగనీతి మరో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది. రష్యాతో యుద్ధానికి తలపడటం ప్రపంచానికి సర్వనాశన హేతువు. అటంబాంబు బెదరింపుతో రష్యాను లొంగదీయడానికి ప్రయత్నించరాదు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని రక్షించే బాధ్యత మనదికాదు అంటూ అమెరికా విదేశాంగనీతిని ఖండించిన వాణిజ్యమంత్రి వాలెస్ను అధ్యక్షుడు ట్రూమన్ రాజీనామా నీయమన్నాడు. సోవియటుతో తగాదాకి కాలుదువ్వే బైరన్సును సమర్థించాడు. "యుద్ధం ముగిసి 16 నెలలు కాలేదు. మరో ప్రపంచయుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు బ్రిటిష్, అమెరికా సామ్రాజ్యవాదులు. ఇలాంటి సమయంలో వాలెస్ హెచ్చరిక అమెరికా ప్రజాతంత్ర శక్తులకు మంచి దోహదం కాక తప్పదు.

రెండో ప్రపంచయుద్ధానికి ప్రధాన కారకమైనది నాజీ జర్మనీ. అట్టి జర్మనీలో ఫాసిస్టు శక్తులు నాశనమై ప్రజాతంత్ర జర్మనీ ఏర్పడితేతప్ప మున్ముందు తిరిగి యుద్ధానికి తలపడకుండా ఉండటం సంభవం కాదు.

అందుచేతనే పోట్స్డాంలో జర్మనీభవిష్యత్తు గూర్చి అగ్రరాజ్యత్రయం ఒక నిర్ణయానికి వచ్చింది. ఫాసిస్టు శక్తులను జర్మనీలో నాశనం చేయడం; యుద్ధానికి కారకమైన భారీ పరిశ్రమలను నాశనంచేసి యుద్ధ పరిహారాల క్రింద తీయడం, తర్వాత ఐక్య ప్రజాతంత్ర జర్మనీని ఏర్పరచడం.ఇదిపోట్స్డాం నిర్ణయం కాని సోవి[illegible] అభివృద్ధి నిరోధక శక్తులను నిలబెట్ట దలచిన బ్రిటన్ అమెరికాలు, జర్మనీని సోవియటు నాశనం చేయగలదని ప్రచారం చేస్తూ వచ్చాయి. ఈ ప్రచారానికి అమెరికా విదేశాంగమంత్రి బైరన్సు నాయకత్వం వహించాడు

సెప్టెంబరు 6న స్టట్ గార్టులో మాట్లాడుతూ జర్మనీ - పోలిష్ సరిహద్దులు (ఇదివరలో అగ్రరాజ్యాలు అంగీకరించినవి) మార్పు చేస్తానని, జర్మనీలో అభివృద్ధి నిరోధక శక్తులను బైరన్సు ఉద్ఘాటించాడు బైరన్సు జర్మనీలో కోరే ఐక్యత అభివృద్ధినిరోధక శక్తుల ఐక్యత, సోషలిస్టు - కమ్యూనిస్టు పార్టీలవంటి ప్రజాతంత్రశక్తుల ఐక్యత కాదు, సోవియటుకు వ్యతిరేకంగాను, జర్మను ప్రజాతంత్రశక్తులకు వ్యతిరేకంగాను, అభివృద్ధినిరోధకశక్తులను బైరన్సు కూడగట్ట ప్రయత్నించుతున్నాడు.

జర్మన్ – పోలిష్ సరిహద్దులు మార్చ వీలులేదు

మాలటోవ్ జవాబు

స్టట్ గార్డులో బైరన్సు చేసిన వుపన్యాసంలో పోలిష్ సరిహద్దు ప్రసక్తి తెచ్చాడు. పోలిష్పత్రికా విలేఖరులతో మాటాడుతూ మాలటోవ్ 16 వ తేదీన ఇలాఅన్నాడు.

"పోట్స్డాం సమావేశంలో, పశ్చిమ పోలెండు సరిహద్దులపై నిర్ణయం జరిగింది. దానిపై అట్లీ, ట్రూమన్, స్టాలిన్ లు సంతకాలు చేశారు. శాంతిమహాసభలో (జర్మనీతో ఒడంబడిక చేసుకునేటప్పుడు) నామకః అక్కడ తిరిగి బలపరచటమే తరువాయి"

పోలెండులో కలిసిన జర్మన్ భూభాగంలోని జర్మన్లను, జర్మనీకి పంపివేయడం గురించి మాలటావ్ ఇలా అన్నాడు.

"బెర్లిన్ సమావేశ నిర్ణయం ఊరికే కాగితాలమీద మాత్రంఉండిపోలేదు ఈసమావేశం కాగానే అదిఆచరణలో పెట్టబడింది. పోలెండు పశ్చిమ సరిహద్దు ప్వినేముండి- ఓడర్ - పశ్చిమ నీస్సేల మీదుగాఉంది. ఈసరిహద్దు అమలులోకి వచ్చి దాదాపు సంవత్సరంపైగా జరిగింది పైనచెప్పిన సరిహద్దుకు తూర్పుననున్న ప్రాంతం అంతా పోలిష్ ప్రభుత్వం చేతిలోఉంది ఆప్రాంతంలో పోలిష్ ప్రభుత్వ పరిపాలనసాగి సంవత్సరం దాటి రెండో సంవత్సరం ప్రారంభమైంది. పోలెండ్ నుండి జర్మను ప్రజలను జర్మనీకి మార్చాలన్న ప్లానును 1945 నవంబరు 26 వ తేదీన. జర్మనీలోని మిత్రరాజ్య కంట్రోల్ కౌన్సిల్ అంగీకరించింది. ఈప్లాను ప్రకారం పోలెండ్ నుండి, బ్రిటిషు - సోవియట్ అధీన జర్మను మండలాలలోనికి 35 లక్షల జర్మనులను పంపడం ప్రారంభమయింది.

"దాదాపు 20 లక్షల మంది జర్మన్లు ఇప్పటికి పోలండునుంచి జర్మనీకి పంపివేయబడ్డారు.

ఖాళీ అయిన జర్మన్ల నివాస స్థానాలలో ఇతర రాష్ట్రాలనుండి పోలిష్వారు వచ్చి. నివసింప సాగారు.

"ఈ విషయం అమెరికా ప్రతినిధులకే గాక తక్కిన దేశాలవారికికూడా తెలుసు పైన ఉదహరించిన విషయాలనుబట్టి, భవిష్యత్తులో బెర్లిన్ నిర్ణయాన్ని మార్చకూడదని వారంగీకరించారన్నమాట.

"అగ్రరాజ్యాల నాయకులు చేసిన సంతకాలకు వివిధదేశాలు చాలా చాలా విలువ ఇస్తున్నాయి. వారి సంతకాలతో ఉన్న నిర్ణయాలకు నైతికంగా విలువా బలమూ ఉన్నాయని ప్రతివారూ అనుకొంటున్నారు.

"అందుచే పోట్స్డాంలో గావించబడిన చారిత్రక నిర్ణయాలు మార్చ వీలులేదు."

పారిస్ సమావేశంలోను, అమెరికా పత్రికలలో రేడియోలలోను కావింపబడుతున సోవియటు వ్యతిరేక ప్రచారానికి, అమెరికా అవలంబించుతున్న విదేశాంగనీతికి అభ్యుదయ కాముక వర్గాలు ఆందోళన చెందుతాయన దానికి అమెరికా వాణిజ్యమంత్రి ఈ నెల 12 వ తేదీన ఇచ్చిన వుపన్యాసం జులై 29 న అధ్యక్షుడు ట్రూమన్ కు వ్రాసిన లేఖ నిదర్శనాలు.

రష్యాతో యుద్ధం ప్రపంచానికి నాశన హేతువు

హెన్రీ వాలెస్ జాబు

అమెరికా విదేశాంగనీతిని ఖండించుతూ ట్రూమన్ కు వాలెస్ వ్రాసిన లేఖ ఇప్పుడు బయటపడింది. దానిలో ముఖ్యాంశాలివి:

1. "డాన్యూబ్ నూ, డార్డినెల్సు జల సంధినీ అంతర్జాతీయపరం చేయాలనీ అచటి రక్షణలు నిర్మూలించాలనీ మనం అంటున్నాం. రష్యా అలాగే పనామా కాలువ, సూయజ్ లను గురించి అడిగితే మనకు ఎంత కోపంవచ్చేది. ఎంతవ్యాకులపడేవాళ్ళం? 2. యుద్ధానికి మనం1300కోట్లడాలర్లనుఖర్చు పెడుతున్నాం. అటంబాంబులపై ప్రయోగాలు చేస్తున్నాం. ప్రపంచంలో సగభాగంలో విమానాశ్రయాలను నిర్మించాం. వాటితో తక్కిన ప్రపంచంపై దాడులు వేయాలని ప్రయత్నిస్తున్నాం. 3. రష్యా మనం చెప్పినట్లువింటే దానికి అటంబాంబు రహస్యాన్ని క్రమంగా చెపుతామంటున్నాం. రష్యాతో మనకు ఘర్షణ ఏర్పడితే అటంబాంబు ఉత్పత్తిపోటీ పెరుగుతుంది. రష్యాతో యుద్ధం అంటే, మానవజాతికంతకూ నాశనం సంభవించుతుంది. రష్యా తన సంరక్షణ ప్రాంతాన్ని పెంపొందింప జూచుకోడం తప్పులేదు. మన యుద్ధసన్నాహాలతో సోవియటును పోల్చి చూడండి (3) బ్రిటన్ కు విశేషంగా అప్పు పెట్టి. అషరతులపైననే రష్యాకు అప్పుపెట్ట నిరాకరించడం; దానితో వర్తకరాయబారాలు జరిపేముందుగానే కొన్ని షరతులు చెల్లించాలని ఒత్తిడిచేయడం, ఆంగ్లో - అమెరికన్ కూటమినిర్మించడానికి మనంప్రయత్నిస్తున్నామని రష్యా నమ్ముతోంది. ప్రతికూల ప్రపంచంచుట్టూ వున్నప్పుడు తన ఉనికికే తాను పోరాడవలసివస్తుందని రష్యాభావించుతోంది. దానితో వర్తకరాయబారాలు సాగించాలి. (4) పరమాణుశక్తికీ, వీటో సమస్యకూ ముడిపెట్టరాదు. పరమాణు శక్తిని అంతర్జాతీయకంట్రోల్ లో పెట్టడానికిఅవసరమైన స్నేహసంబంధాలురష్యాతో నెలకొల్పుకోవాలి. (4) మరో ప్రపంచ యుద్ధమేవస్తే అటంబాంబులవల్ల అమెరికా ముఖ్యపట్టణం ఒక్కటి మిగిలదనీ. 4 కోట్ల పట్టణ ప్రజలు మొదట బలిగావలసి యుంటుందనీ గుర్తుంచుకోవాలి. అందుచే ఇలాంటి యుద్ధానికి దారితీసే విదేశాంగనీతిని అరికట్టి, అభ్యుదయకర నాయకత్వం అమెరికా రాజకీయాలలో ఏర్పడాలి. తక్కిన ప్రపంచం ఏమైతేనేమి అనే ధోరణి మానాలి. రష్యాతో యుద్ధం చేయాలనే ధోరణి పోవాలి.

ఈనెల 12 వ తేదీన ఉపన్యసించుతూ వాలెస్ ఇంకా ఇలా అన్నాడు.

"రష్యాతో యుద్ధంచేయాలని కోరుతున్న వారి చేతులలో మన విదేశాంగనీతిని పెట్టరాదు వారి వలలుబడి క్రిందకు మనం పోకూడదు.. దీని అర్థం రష్యాను సంతృప్తి పరచడంకాదు మనం రష్యాతో పూర్తిగా శాంతిని కోరుతున్నాం. ఇందుకు ఉభయత్రా సామరస్యము వుండాలి. అమెరికా సైనికుల ప్రాణాలను బ్రిటిష్ సామ్రాజ్యాన్ని రక్షించడం ధారపోసి, పడమటి ఆశియాలో పెట్రోల్ నూనె గుత్తకొనడం. మన విధానం కాదని మనం బుజావు చేసుకుంటే రష్యానుంచి మనకు సహకారం వస్తుంది. నూనె గుత్తాధిపత్యంకోసం పోటీలుపడే పెట్టుబడిదారీవర్గాలు మన దేశాన్ని యుద్ధంలోకి యీడ్వడాన్ని మనము అంగీకరించరాదు"

వాలెస్ లేఖా, అతని ఉపన్యాసమూ అమెరికా విదేశాంగమంత్రి బైరన్సుకు తేళ్ల ప్రాకినట్లయింది. బైరన్సు నాయకత్వాన ఉన్న అభివృద్ధి నిరోధకముఠా ట్రూమన్ పై ఒత్తిడి తెచ్చింది. బైరన్సు - ట్రూమన్ల టెలిఫోను సంభాషణల ఫలితంగా, వాలెస్ ను రాజీనామా నీయమని ట్రూమన్ అన్నాడు. ఇది అమెరికాలో అభివృద్ధి కాముకులకు కొంత దెబ్బ.

వాలెస్ ఉపన్యాసాన్ని ఏర్పాటుచేసిన అమెరికాపౌరుల "పొలిటికల్ యాక్షన్ కమిటీ" ఇలా ప్రకటించింది.

"వాలెస్ రాజీనామా మన దేశంలో అభ్యుదయ వర్గాల స్వతంత్ర కాముకులకు పెద్ద దెబ్బ. అమెరికా పాలకవర్గంలో అభ్యుదయ వర్గాలను ప్రతిబింబించే ఒక గట్టిచెయ్యిపోయిందన్నమాట. 'రష్యాతో యుద్ధానికి సిద్ధంగావాలి.' అనే ధోరణిని ఎదిరించిన వాలెస్ రాజీనామా అంటే మనదేశం యుద్ధం అనే సంతాలో ఎంతదూరం వొర్లిపోయిందో తెలుసుకోవచ్చు."

రష్యాను వేరుచేసి యూరప్ లో ఫ్రాన్సు – జర్మన్ కూటమి ఏర్పరచాలి

చర్చిల్ ప్రలాపం

ఫాసిజాన్ని ఓడించిన ఈ యుద్ధంలో ప్రపంచమంతా అభ్యుదయ శక్తులుబలపడ్డాయి సోవియటు ప్రపంచానికి మార్గదర్శిగా కనపడింది. యూరప్ ప్రజాస్వామ్య వెల్లువతో మునిగిపోయింది. ఇదిచూచిచర్చిల్ లాంటి పచ్చిసామ్రాజ్యవాదులు గడగడలాడుతున్నారు.

19 వ తేదీన జ్యూరిచ్ (స్విజర్లండ్)లో మాట్లాడుతూ రష్యాను వేరుపరిచి 'సంయుక్త యూరప్ రాజ్యకూటమి' ఏర్పరచాలన్నాడు. దీనికి జర్మనీ, ఫ్రాన్సులు నాయకత్వంవహించాలన్నాడు. అటంబాంబురహస్యం రష్యాకు తెలియకముందే జాగ్రత పడాలన్నాడు. మరల ప్రపంచ యుద్ధానికి ప్రేరేపిస్తూ చర్చిల్ ప్రలాపించాడు. తాను సూచించిన యూరప్ ప్రణాళికలాంటిదాన్ని ట్రూమన్ అంగీకరించా డన్నాడు.

బైరన్సు స్టట్ గార్డ్ ఉపన్యాసమేమి, చర్చిల్ జ్యూరిచ్ ప్రసంగమేమి, సామ్రాజ్యవాదుల పాతప్లానులనే బయట పెడుతున్నాయి. సోవియట్ కువ్యతిరేకంగాజర్మనీని తిరిగి కేంద్రంగా చేయాలని చూస్తున్నాయి.

వివిధ దేశాలలో బ్రిటిష్ సైన్యాలు

'న్యూటైమ్సు' విమర్శ

లండన్, సెప్టెంబరు 19

"శాంతికి భంగకరమైన పరిస్థితులు" అనే శీర్షికతో సోవియట్ పత్రిక "న్యూటైమ్సు" ఒక వ్యాసం వ్రాసింది. అవసరం లేకపోయినా ఇంకా వివిధ దేశాలలోవున్న బ్రిటిష్-అమెరికన్ సైన్యాల సంఖ్యలను దానిలో తెల్పింది ఈ సైన్యాలుండడంవల్లనే, అక్కడ కక్షలు, కొట్లాటలు, అశాంతి ఎక్కువ అవుతున్నాయని విమర్శించింది.


వివిధ దేశాలలో బ్రిటిష్ సైన్యాలు ఈవిధంగా వున్నాయి.

— ఇండోనీషియాలో	1 లక్ష
— గ్రీసులో	1 లక్ష
— తూర్పు అరబ్బు దేశాలలో	2 లక్షలు
— ఇరాక్ లో	50 వేలు
— ట్రాన్స్ జోర్డాన్	1½ లక్షలు
— పాలస్తయిన్ లో	80 వేలు

ఇదిగాకుండా ఇండో చీనాలో మరి కొన్నివేలున్నాయి. భారత దేశంలో బ్రిటిష్ సైన్యాలు 1939 నాటికంటె నేడు 9 రెట్లున్నాయి. (షుమారు 2½ లక్షలుంటాయి)

ఇదేవిధంగా చైనా ఫిలిప్పైన్సు మొదలైన దేశాల్లోవున్న అమెరికన్ సైన్యాల సంఖ్యనుకూడా ఆపత్రిక ప్రకటించింది.

కమ్యూనిస్టులపై దాడికి తర్ఫీయత్



ఆటంబాంబు రహస్యం రష్యాకు తెలియకముందే తొందరపడండి



అంతర్జాతీయంగా సోవియట్ వ్యతిరేకతనూ, అభివృద్ధి నిరోధక భావాలనూ, చర్చిల్ నెత్తిన నోరుపెట్టుకొని బాకా వూదుతున్నాడు. ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకూ, నీతికీ, నిజాయితీకి పేరుపొందిన డాక్టరు పట్టాభి గారికే ఆ ఖ్యాతి దక్కింది. ఒకవేపు రష్యా మనదేశంమీదకి దండెత్తివచ్చేస్తోందనీ, యింకోవేపు మతకలహాలకూ, కమ్యూనిస్టులపై దాడి చెయ్యడానికే సాము, గరిడీలు నేర్చుకోమంటున్నారు. (చూ. బందరు ఉపన్యాసం, సెప్టెంబరు 15) శేష: సామ్రాజ్యవాది చర్చిల్ అడుగుజాడల్లో నడుస్తున్నాడు జాతీయవాది పట్టాభిగారు.

Edited, Printed & Published by Katragadda Rajagopalarao at the Prajasakti Press, Moghalrajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE